JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి | శుక్రవారం 03-04-2026
Medchal - Malkajgiri | Friday 03-04-2026
Follow: jayabherinews
సంపుటి : 02 | సంచిక : 305
పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 305 | Pages : 8 | ₹: 5






**కేరళంలో ఇందిరా ఐదు గ్యారంటీలు:**
కేరళం శాసనసభ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి విడుదల చేసిన మేనిఫెస్టోలోని ఇందిరా ఐదు గ్యారంటీలు..
కేరళ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ కేఎస్ఆర్టీసీ, బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం.
కాలేజీ చదువుతున్న బాలికలకు నెలకు రూ.1,000 ఆర్థిక సహాయం.
సంక్షేమ పింఛన్లు నెలకు రూ.3 వేలకు పెంపు.
మాజీ ముఖ్యమంత్రి ఊమెన్ చాండీ పేరుతో ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమా.
యువతకు స్వయం ఉపాధి కోసం రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు.
ఐదు గ్యారంటీలతో పాటు సముద్ర, విమానయాన రంగాలకు సంబంధించి ఐదు డ్రీమ్ ప్రాజెక్టులు, వయనాడ్‌లో గిరిజన విశ్వ విద్యాలయం ఏర్పాటు వాగ్దానాలు ఉన్నాయి.

# కేరళ గడ్డపై సీఎం సవాల్!


- గ్యారంటీలపై సందేహాలుంటే తెలంగాణకు రండి
- అవినీతి.. కుటుంబ పాలనలో ఒకేలా కేసీఆర్.. విజయన్ కుటుంబాలు
- కేంద్ర నిధులు మోదీ కరుణ కాదు ప్రజల హక్కు
- తొలి క్యాబినెట్ నుంచే హామీల అమలు..
- యూడీఎఫ్ మేనిఫెస్టో విడుదలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ :**
కొచ్చి యూడీఎఫ్ ప్రకటించిన గ్యారంటీలపై విమర్శలు చేస్తున్న వారు అవి ఎలా అమలవుతాయో తెలుసుకోవాలంటే తెలంగాణకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో అమలవుతున్న పథకాలను ప్రత్యక్షంగా చూసి..తమ ట్రాక్ రికార్డు పరిశీలించుకోవచ్చని ఆయన సూచించారు. కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్, ఆయన మంత్రులు తెలంగాణకు వస్తే తాము గ్యారంటీలు ఎలా అమలు చేస్తున్నామో ప్రత్యక్షంగా చూపుతామని సీఎం తెలిపారు. కేరళం శాసనసభ ఎన్నికలకు సంబంధించి యూడీఎఫ్ మేనిఫెస్టోను కొచ్చిలో గురువారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కేరళంలో పినరాయి విజయన్ హయాం ముగిసిందని, ఇక యూడీఎఫ్ స్వర్ణయుగం మొదలవుతుందన్నారు.

**మోదీ బ్రదర్స్.. పినరాయి కేసీఆర్‌ల మధ్య పోలికలు**
ముఖ్యమంత్రి పినరాయి విజయన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశాన్ని, కేరళంనూ మోదీ బ్రదర్స్ పాలిస్తున్నారని మోదీ.. విజయన్‌ను ఉద్దేశించి సీఎం వ్యాఖ్యానించారు. దేవుడి స్వంత రాష్ట్రంలో దేవుడి ఆస్తికీ రక్షణ లేదంటూ పరోక్షంగా శబరిమల బంగారం ఉదంతాన్ని సీఎం లేవనెత్తారు. కేరళంలో గత పదేళ్లుగా పినరాయి విజయన్ ప్రభుత్వం కొనసాగుతోందని, అలాగే 2014 నుంచి సుమారు పదేళ్ల పాటు కేసీఆర్ తెలంగాణను పాలించారన్నారు. పినరాయి కుటుంబ పాలన, అవినీతి, అసమర్థ పాలన విషయంలో పినరాయి విజయన్, కేసీఆర్‌ల మధ్య అనేక పోలికలు ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. 2023లో తెలంగాణలో మాదిరి మార్పే ఈసారి కేరళంలో చోటుచేసుకుంటుందని సీఎం అన్నారు. పినరాయి విజయ్ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దింపుతారని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. పో మోనే విజయా,వ్యాఖ్యపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.

...మిగతాది 2 లో

# యుద్ధం సాకుగా పాకిస్తాన్ భారత్‌పై నీచమైన చర్యకు పాల్పడుతోంది




- గత 11 ఏళ్లుగా, అంతర్గత భద్రత అయినా, బాహ్య శత్రువుల నుంచి రక్షణ అయినా, ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం జాతీయ భద్రతను బలోపేతం చేసింది
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

**జయభేరి, న్యూఢిల్లీ:**
మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఘర్షణల నేపథ్యంలో, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పొరుగు దేశానికి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. గురువారం (ఏప్రిల్ 2) పాకిస్థాన్ పేరు ప్రస్తావించకుండానే దానిపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ, పొరుగు దేశంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల దృష్ట్యా ఎవరైనా భారతదేశంపై దుస్సాహసానికి పాల్పడవచ్చన్నారు. ఒకవేళ పాకిస్థాన్ అలా చేయడానికి సాహసిస్తే, భారతదేశం తీసుకునే చర్య అపూర్వమైనదిగా,

...మిగతాది 2 లో

# ప్రధాని మోదీతో బండి సంజయ్ భేటీ




- కరీంనగర్ మున్సిపల్ విజయంపై ప్రశంసలు
- ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలి
- కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమాజంలోని అట్టడుగు వర్గాలకు, చివరి వ్యక్తికి అందేలా నిర్విరామంగా పనిచేయాలి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:**
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాజకీయ పరిణామాలు, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను బీజేపీ కైవసం చేసుకోవడంపై ప్రధాని మోదీ ప్రత్యేకంగా సంతోషం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులు, అభివృద్ధి నినాదంతోనే తాము ప్రజల్లోకి వెళ్లామని, ప్రజలు బీజేపీ నాయకత్వంపై నమ్మకం ఉంచారని బండి సంజయ్ ప్రధానికి వివరించారు. ఈ విజయం

...మిగతాది 2 లో

# అమరావతి రాజధానికి రాజ్యసభ ఆమోదముద్ర




- మద్దతు ప్రకటించిన బీఆర్ఎస్
- రాజధాని బిల్లును వ్యతిరేకిస్తూ రాజ్యసభలోనూ వైసీపీ వాకౌట్
- గత 12 ఏళ్లుగా కొనసాగుతున్న అనిశ్చితికి ఈ బిల్లు ముగింపు పలుకుతుందని ఎంపీలు
- రాష్ట్రపతి సంతకం చేసిన వెంటనే చట్టంగా మారుతుంది

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన (సవరణ) బిల్లు 2026కు రాజ్యసభలో ఘనమైన ఆమోదం లభించింది. ఏపీ ఏకైక రాజధానిగా అమరావతిని చట్టబద్ధం చేస్తూ కేంద్రం ప్రవేశపెట్టిన ఈ బిల్లుపై గురువారం ఎగువసభలో సుదీర్ఘ చర్చ జరిగింది. లోక్‌సభ ఇప్పటికే ఈ బిల్లును ఆమోదించగా, నేడు రాజ్యసభ కూడా పచ్చజెండా ఊపడంతో అమరావతికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించే దిశగా మరో కీలక అడుగు పడింది. పదకొండు రాజకీయ పార్టీలకు చెందిన 17 మంది ఎంపీలు ఈ చర్చలో పాల్గొని ఏపీ రాజధానిగా అమరావతికి తమ మద్దతు ప్రకటించారు. ఈ చర్చలో అనూహ్య రీతిలో

...మిగతాది 2 లో



# హైదరాబాద్‌లో చికెన్ దొరకట్లే

- కోళ్ల కూ ఓ రోజొచ్చింది!

**హైదరాబాద్, ఏప్రిల్ 2 :**
హైదరాబాద్ మహానగరంలో చికెన్ ప్రియులకు పెద్ద షాక్ తగిలింది. నగరంవ్యాప్తంగా వందలాది చికెన్ షాపులు స్వచ్ఛందంగా మూతపడటంతో మాంసం విక్రయాలు పూర్తిగా నిలిచిపోయాయి. సాధారణ రోజుల్లోనూ కిటకిటలాడే చికెన్ సెంటర్లు వెలవెలబోవడానికి ప్రధాన కారణం రిటైల్ వ్యాపారులకు, హోల్‌సేల్ సరఫరాదారులకు మధ్య తలెత్తిన మార్జిన్ వివాదం . తమకు వస్తున్న లాభం నామమాత్రంగా ఉందని, పెరిగిన ఖర్చులకు అనుగుణంగా మార్జిన్ పెంచకపోతే వ్యాపారం చేయలేమని రిటైలర్లు సమ్మెకు దిగారు.ఈ వివాదానికి ప్రధాన కేంద్రం చికెన్ విక్రయాలపై వచ్చే కమిషన్. ప్రస్తుతం బాయిలర్

...మిగతాది 2 లో

# కొత్తగా 2 లక్షల పెన్షన్లు




**హైదరాబాద్, ఏప్రిల్ 2 :**
తెలంగాణలో కొత్త పెన్షన్ల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న లక్షలాది మందికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. చేయూత పథకం కింద కొత్తగా మరో 2 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా 2026, 27 వార్షిక బడ్జెట్‌లో రూ.233 కోట్లను కేటాయించడంతో, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు రంగం సిద్ధమైంది. అయితే, ఇప్పటికే పేరుకు పోయిన లక్షలాది దరఖాస్తుల నుంచి అర్హులను గుర్తించడం అధికారులకు పెను సవాల్‌గా మారనుంది.

# కులం కుంపట్లు.. మతం మంటలు..

...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## కేరళ గడ్డపై సీఎం సవాల్!

విజయన్ తమకు రాజకీయ ప్రత్యర్థి అని, మోదీలా మాట్లాడటం తనకు సాధ్యం కాదని, విమర్శించకుండా ఉండటం తన స్వభావం కాదని స్పష్టం చేశారు. అవినీతి నియంత్రణ, ఆదాయానికి గండిపెట్టే అంశాలను నియంత్రించడం, కేంద్ర పథకాల గరిష్ట వినియోగం, రాష్ట్రానికి రావలసిన నిధుల సాధన.. తమ ప్రాధాన్య అంశాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కరుణ కాదని.. అది ప్రజల హక్కు అనే విషయం ప్రజలకు తెలియజేస్తామని సీఎం తెలిపారు. యూడీఎఫ్ కార్మికుల కూటమి అని, కూటమిలో నిజాయితీగల నాయకులు ఉన్నారని సీఎం వ్యాఖ్యానించారు.

**తొలి క్యాబినెట్ నుంచే హామీల అమలు..**

కేరళంలో యూడీఎఫ్ గ్యారంటీలు అమలు సాధ్యమా అని కొందరు సందేహాలు వ్యక్తం చేస్తున్నారని..దానికి సమాధానం తెలంగాణ రాష్ట్రమే అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి క్యాబినెట్ సమావేశం నుంచే గ్యారంటీలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. 25 లక్షల రైతు కుటుంబాలకు చెందిన రూ.21 వేల కోట్ల రుణాలను తాము మాఫీ చేశామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సాగు చేసుకునే రైతులకు ఎకరాకు రూ.12 వేలు చొప్పున ఏడాదికి రూ.18 వేల కోట్లు రైతు భరోసా కింద అందజేస్తున్నామని సీఎం తెలిపారు. 67,173 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, వివిధ శాఖల్లో నియామకాలు పూర్తి చేయడంతో పాటు ప్రజల సమక్షంలో ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశామని సీఎం వివరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, 10 వేల బస్సులు, 50 వేల సిబ్బందితో ఉన్న ఆర్టీసీని నష్టాల నుంచి లాభాల్లోకి తీసుకు వచ్చామని సీఎం తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు నెలకు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు ఆదా అవుతోందన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. మహిళలను బస్సుల యజమానులుగా, వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నామని సీఎం తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ 2047 ప్రకారం తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలపనున్నామని సీఎం ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ వృద్ధిరేటు 10.8 శాతంగా ఉందని, పన్నులు పెంచకుండానే అభివృద్ధి సాధ్యమని తాము నిరూపించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కేపీసీసీ ప్రెసిడెంట్ సన్నీ జోసెఫ్, కేరళ సీఎల్పీ నేత వి.డి.సతీషన్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీప్ దాస్ మున్షీ, యూడీఎఫ్ కన్వీనర్ ఆదూర్ ప్రకాష్, ఐయూఎంఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి పి.కె.కున్హాలికుట్టి తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగా 2 లక్షల పెన్షన్లు

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేటగిరీలలో 42.23 లక్షల మంది నెలనెలా చేయూత పెన్షన్లు పొందుతున్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత, చేనేత కార్మికులు, హెచ్ఐవీ, బోదకాలు బాధితులకు నెలకు రూ.2,016 చొప్పున ప్రభుత్వం అందిస్తోంది. దివ్యాంగులకు మాత్రం పెన్షన్‌ను రూ.4,016గా ఇస్తున్నారు. ఇప్పుడు ఈ జాబితాలోకి మరో 2 లక్షల మంది కొత్తగా చేరనున్నారు. గత మూడేళ్లుగా బోదకాలు, డయాలసిస్ బాధితులకు తప్ప కొత్తగా ఎలాంటి పెన్షన్లు మంజూరు కాకపోవడంతో అర్హులైన వారు తీవ్ర నిరాశలో ఉన్నారు.ఈ నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12 లక్షలకు పైగా దరఖాస్తులు ప్రభుత్వానికి చేరి పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల బడ్జెట్‌లో కొత్త పెన్షన్ల ప్రకటన వెలువడిన తర్వాత, ఫిబ్రవరి 20 నుంచి ప్రజావాణి వంటి కార్యక్రమాల ద్వారా దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. దీనికి తోడు, రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న గ్రామసభల్లో కూడా భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.ప్రభుత్వం ఆమోదించినవి 2 లక్షల పెన్షన్లు కాగా, ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల సంఖ్య 12 లక్షలు దాటింది. వీటిలో వృద్ధాప్య పింఛన్ కోసం 4 లక్షలు, వితంతు, ఒంటరి మహిళల కోటాలో 3.5 లక్షలు, గీత, చేనేత కార్మికుల విభాగంలో 3 లక్షలు, దివ్యాంగుల పింఛన్‌కు 72 వేల దరఖాస్తులు ఉన్నాయి. ఈ భారీ సంఖ్య నుంచి కేవలం 2 లక్షల మంది అత్యంత అర్హులను ఎంపిక చేసేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు త్వరలోనే పటిష్టమైన వడపోత కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించడం ప్రభుత్వానికి కత్తిమీద సాములా మారింది.

## ప్రధాని మోదీతో బండి సంజయ్ భేటీ

తెలంగాణలో పార్టీ బలోపేతానికి నిదర్శనమని ప్రధాని కొనియాడారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులందరికీ 'మోదీ గిఫ్ట్' పేరుతో ఉచితంగా బ్రాండెడ్ సైకిళ్లు అందించిన విషయాన్ని బండి సంజయ్ ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా చేపట్టిన ఈ సేవా కార్యక్రమాన్ని ప్రధాని అభినందించారు. నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు మరియు ప్రజా ప్రతినిధుల తరపున బండి సంజయ్ ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. భేటీ సందర్భంగా ప్రధాని మోదీ బండి సంజయ్‌కు పలు మార్గదర్శకాలను అందించారు. ప్రజలకు సేవ చేయడంలోనే నిజమైన తృప్తి ఉంటుందని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమాజంలోని అట్టడుగు వర్గాలకు, చివరి వ్యక్తికి అందేలా నిర్విరామంగా పని చేయాలని ఆదేశించారు. ప్రజా ప్రతినిధులు ప్రజలకు జవాబుదారీగా ఉంటూ, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రధానితో భేటీ అనంతరం బండి సంజయ్ మాట్లాడుతూ.. ప్రధానిని కలిసిన ప్రతిసారీ నాకు రెట్టింపు శక్తి, బాధ్యతా భావం కలుగుతాయి. తెలంగాణ ప్రజలకు సేవ చేయాలనే నా సంకల్పాన్ని మోదీ మాటలు మరింత బలోపేతం చేశాయి. తెలంగాణ అభివృద్ధి కోసం, బీజేపీ లక్ష్యాలను ప్రతి ఇంటికీ చేరవేయడం కోసం మరింత కఠోరంగా శ్రమిస్తాను అని పేర్కొన్నారు.

## యుద్ధం సాకుగా పాకిస్తాన్ భారత్‌పై..

నిర్ణయాత్మకమైనదిగా ఉంటుందని రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ దేశంలో ఇంధన లేదా గ్యాస్ సంక్షోభం లేదని స్పష్టం చేశారు. ఎలాంటి ఇంధన సంక్షోభాన్ని అయినా ఎదుర్కోవడానికి భారతదేశం సిద్ధంగా ఉందని ఆయన అన్నారు. హోర్ముజ్ జలసంధి గుండా భారత నౌకాదళం ట్యాంకర్లను సురక్షితంగా రవాణా చేస్తోందని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న ప్రయత్నాలను ప్రస్తావిస్తూ, భారతదేశ ప్రయోజనాలను కాపాడటానికి ప్రధానమంత్రి దౌత్య నైపుణ్యాలను ఉపయోగిస్తున్నారని ఆయన అన్నారు. "గత 11 ఏళ్లుగా, అంతర్గత భద్రత అయినా, బాహ్య శత్రువుల నుంచి రక్షణ అయినా, ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం జాతీయ భద్రతను బలోపేతం చేసింది" అని రక్షణ మంత్రి అన్నారు. "కేవలం ఉగ్రవాదం గురించే మాట్లాడుకుంటే, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పరిస్థితి ఎలా ఉండేదో గుర్తుందా? దేశంలో ఎక్కడో ఒకచోట ప్రతిరోజూ ఉగ్రవాద ఘటనలు, పలు నగరాల్లో బాంబు పేలుళ్లు జరిగేవి. కానీ ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉగ్రవాద ఘటనలను అరికట్టడమే కాకుండా, ఉగ్రవాదంపై నిర్ణయాత్మక చర్యలు కూడా తీసుకున్నాము." అని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ప్రస్తావిస్తూ, "ఉరి దాడి తర్వాత జరిపిన సర్జికల్ స్ట్రైక్ అయినా, పుల్వామా తర్వాత జరిపిన వైమానిక దాడి అయినా, లేదా పహల్గామ్ ఘటన తర్వాత ఇటీవల చేపట్టిన ఆపరేషన్ సింధూర్ అయినా, ఉగ్రవాదంపై భారీ దాడిని ప్రారంభించాము." ఆయన అన్నారు. "పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద ఘటన తర్వాత , ఆపరేషన్ సింధూర్ సమయంలో భారత సైనికులు కేవలం 22 నిమిషాల్లోనే పాకిస్థాన్‌ను మోకరిల్లేలా చేశారు. ఇది భారత సైనిక చరిత్రలోనే అతిపెద్ద ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్." అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ అన్నారు.

# కులం కుంపట్లు.. మతం మంటలు..

- కులం, మతం, అర్చకత్వం
- వీటిపై ప్రజలు ఆలోచిస్తున్నారా..?
- మరోసారి చర్చల్లోకి వస్తున్న పద్మశ్రీ మందకృష్ణ...
- మరో దుమారానికి తెర లేపడానికి అసలు కారణం..!?
- ప్రతినిత్యం ఎస్సీలను రెచ్చగొట్టడమే పనిగా పెట్టుకున్నాడ..!?
- కులాన్ని పూర్తిగా సమూలంగా నాశనం చేయలేని ఈ దేశంలో మతం గురించి ఎందుకు?
- కుల మతాలు విసర్జించే మలమూత్రాలు అని తెలియదా..?
- ప్రపంచీకరణ జరిగిన తర్వాత కూడా ఇంకా కుల, మతాల ప్రస్తావన తేవడానికి అసలు కారణమేంటి..!?
- బిజెపి తెలంగాణలో అధికార పగ్గాలు చేపట్టాడానికి ఇలా మందకృష్ణ గారిని వాడుకుంటున్నారా..!?
- మాల మాదిగలను విడగొట్టిన పద్మశ్రీ మందకృష్ణ ఇప్పుడు అర్చకత్వం మీద దళితులను ఆహ్వానిస్తున్నాడా..?





కడారి శ్రీనివాస్
జయభేరి సీనియర్ జర్నలిస్ట్,
98489 62799
కవి రచయిత, గాయకుడు,
తెలంగాణ ఉద్యమకారుడు,
గిడుగు రామ్మూర్తి అవార్డు గ్రహీత

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లోనే కాదు తెలుగు రాజకీయాల్లో పద్మశ్రీ మందకృష్ణ తనదైన శైలిలో ఎస్సీల మధ్య మంటలు రేపుతూ మరో కొత్త ముఖాన్ని కెమెరా ముందు చూపిస్తున్నాడు. ప్రధాన దేవాలయాల్లో అర్చకులుగా ఎస్సీలను ఎందుకు పెట్టట్లేదు? భారతదేశంలో కుల ప్రస్తావన నశిస్తే మేం సపోర్ట్ చేస్తాం...!? అనే ఎడతెగని ప్రశ్నలను సంధిస్తూ మరొకసారి వార్తల్లోకి ఎక్కుతున్నాడు... పద్మశ్రీ వచ్చింది కదా ఎట్లాగూ ఇంట్లో కూర్చుని ఏం పని చేయాలి? ఏదో ఒక మంటలు రేపితే సమాజం మొత్తం అటువైపు చర్చలు మీటింగులు టీవీలలో డిబేట్లు మొత్తానికి మనం సంధించిన బాణం బాగానే దూసుకెళ్తోంది... అని అనుకునేలా ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో పూర్తిగా ఏ ఛానల్ చూసిన హిందూ మతం అందరిదీ.. అలాంటప్పుడు దళితులకు ప్రధాన ఆలయాల్లో అర్చకులుగా ఎందుకు ఉండకూడదు? ఇది కరెక్ట్ మంచిగానే అడిగాడు! అనే అంశం చర్చలోకి వస్తుంది... ఆలోచన మంచిదే! అయినా ప్రస్తుతం ఇప్పుడు ఎందుకు ఆ మాట వచ్చిందో ఒకసారి ఆలోచించాలి..!? "ఎస్సీలు మతం మారితే వారికి రిజర్వేషన్లు దక్కవు" అని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన సందర్భంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో పద్మశ్రీ మందకృష్ణ మీడియా సమావేశం ఇప్పుడు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది... నిన్నటి వరకు మాల మాదిగల మధ్య అగ్గి రగిలించిన సదరు ఈ పెద్దమనిషి విజయ దుందుభిని మోగించి బాగానే ఇమేజ్ ని దక్కించుకున్నాడు. అందుకు తగ్గ ఫలితం కూడా దక్కింది!

**ఇప్పుడు మళ్లీ చర్చల్లోకి ఎక్కడానికి రాజకీయ వేడి పుట్టించడానికి కులం మతం అర్చకత్వం... !?**

వీటిపై ప్రశ్నల బాణాన్ని సంధించారు.. అంశం ఎప్పుడు మాట్లాడిన నిత్య నూతనంగానే ఉంటుంది. కానీ తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో సమస్యలు పెండింగ్లో ఉన్న సంగతి మనందరికీ తెలుసు. ఇక్కడ ప్రజలు ఏ సమస్యలతో బాధపడుతున్నారో అది కూడా తెలుసు. మౌలిక వసతుల కల్పన, ఉపాధి విద్య, వైద్య రంగాల్లో ఒకవైపు గత పది సంవత్సరాల్లో వ్యవస్థీకృత విధ్వంసం జరిగిన మాట వాస్తవం కాదా..!? రెవిన్యూ ఆరోగ్యం పౌరసరఫరాల శాఖ, శిశు సంక్షేమ శాఖ, విద్య ఇలా ఏ వ్యవస్థలో చూసిన పూర్తిగా అవినీతి రాజ్యమేలిన సందర్భాలను ఇప్పటికీ మనం చూస్తూనే ఉన్నాము... ఇలాంటి ప్రాథమిక మౌలిక సమస్యలను పక్కనపెట్టి కులానికి మతానికి, అర్చకత్వానికి, అంత ప్రాముఖ్యతను ఇస్తూ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో పెట్టడం, అందులో అనేక విషయాలు పద్మశ్రీ మందకృష్ణ మాట్లాడడం మరో రాజకీయ ఎత్తుగడకు సంకేతంగా కనిపిస్తోంది. కులం మతం ఈ రెండు చాలా సున్నితమైన అంశాలు. వీటి గురించి అంబేద్కర్ ఇలాంటివారు భవిష్యత్తులో మీ ముందుకు వస్తారు అని ముందే చెప్పాడు. నాటకాలతో ఒకరు, కులమతాలతో ఒకరు పాటలతో మరొకరు రకరకాల విభిన్న వేషాలతో ఒక్కొక్కరు తమ రాజకీయ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడానికి అనేక కుటిల పన్నాగాలు సమాజంలో విసురుతారు అని అంబేద్కర్ ఏనాడో చెప్పాడు... వాటన్నింటినీ జయించాలి. అంటే ముందు కచ్చితంగా అందరూ చదువుకోవాలి అంటూ ఆయన చదువుకిచ్చిన ప్రాముఖ్యత ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి. ఆయన మాట్లాడిన ప్రతి అంశంలోనూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విద్యకి ఎక్కువ ప్రాముఖ్యతను ఇచ్చారు. ఆనాడు అంబేద్కర్ ఇలాంటి కుల మతాలను ఎదుర్కొంటూ కూడా ఆయన యువతను విద్య వైపు మళ్ళించారు. తన జీవితాన్ని ఈ దేశం కోసం త్యాగం చేశారు. కానీ ఈ పెద్దమనిషి నేడు చేస్తున్నది ఏంటి?

దేశంలో అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ప్రజలు ఒకవైపు ఉంటే... తనకు మాత్రం దేవాలయాల్లో అర్చకులుగా మా ఎస్సీలు ఉండకూడదా? మా బీసీలు ఉండకూడదా? అని మాట్లాడడం దేనికి సంకేతం? మా ఎస్సీలు మా బీసీలు, మా ఎస్టీలు అని చెప్పే ఈ పెద్ద మనిషికి వీళ్లంతా ఆయన వెనుక ఉన్నారా? వీళ్ళందరికీ ఆయన నాయకత్వం వహిస్తున్నాడ? ఎస్సీలోనే అనేకమంది ఈ పెద్ద మనిషి అంటే విరుచుకుపడే సమాజం ఒకవైపు ఉంటే.... ఇప్పుడు సమాజంలో మరో కుంపటిని రాజేసి ఏం చక్క తన పని తాను చేసుకుపో తున్నారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో మాట్లాడిన ప్రతి విషయం అవసరమే కానీ ప్రస్తుత పరిస్థితుల్లో అలాంటి ప్రశ్నలు ఈ సమాజానికి అవసరం లేదు.

ప్రపంచీకరణ తర్వాత అత్యాధునిక శాస్త్ర సాంకేతిక రంగాల్లో,ఉత్తర భారత దేశంలో యుద్ధ వాతావరణం మిగిలిన దేశాల్లో ఆర్థిక విచ్చిన్నం, ఎంతోమంది తెలుగు రాష్ట్రాల్లో కాకుండా మిగతా రాష్ట్రాల్లో కూడా దేశంలో ప్రజలందరూ ఆర్థిక ఇబ్బందులతో కుమిలిపోతూ సతమౌతమైపోతున్న ఈ తరుణంలో ఈ విషయానికి అంత ప్రాధాన్యత ఇవ్వడం దేనికి? అంతేకాకుండా ప్రస్తుతం ప్రతి ఐదుగురిలో అన్ని కులాల వాళ్ళు ఉండడం చూస్తున్నాం. ప్రతి వ్యవస్థలో అన్ని కులాల వాళ్లు పని చేయడం, చిన్న పెద్ద అనే తేడా వ్యత్యాసం దాదాపు కులం తుడుచు పెట్టుకుపోయినా, ప్రతి ఒక్క మతాన్ని ఒకరికొకరు గౌరవించుకుంటున్న, (ఎక్కడో ఒకచోట కొంతమంది ఈ విషయంపై రాద్ధాంతం చేయడం) ఈ సమాజంలో ప్రస్తుతం ప్రధాన ఆలయాల్లో అర్చకులుగా మా బిడ్డలు వద్ద? మేమంతా హిందువులమే కానీ మాకు ఆ పదవులు ఇవ్వరా? మమ్మల్ని అంటరాని వాళ్ళుగా చేసి మీరు మాత్రం అధికారం దక్కించుకుంటారా? ఇలాంటి చాలా సున్నితమైన అంశాలను పద్మశ్రీ మందకృష్ణ సంధించాడు.. నేటి సమాజంలో ఒకవైపు యువత అన్ని రంగాల్లో ముందుకు వెళ్తూ ఉపాధి కోసం విద్యా వ్యవస్థలో ఉన్నత శిఖరాలకు వెళ్లడానికి వెళుతున్న నేపథ్యంలో మనువాదులు ఈ రాజ్యాన్ని ఏలుతూ గౌరవ సుప్రీంకోర్టు ద్వారానే దళితులు క్రైస్తవంలోకి మారితే ఎస్సీ హోదా పోతుంది అని చెప్పేయడం వెనక ఇలాంటి వాళ్లను ఉసిగొల్పడానికే..! ఒకవైపు ఎస్సీలను మతం మారితే ఆ హోదా తీసేయడం అని సుప్రీంకోర్టు తీర్పును తప్పు పడుతూనే అలా చేయకూడదు కులాన్ని తీసేసి ఆర్డర్ ఇస్తే బాగుండు అని చెప్పడం కోసమేరుపు. అంటే అది జరగదు అని ఈ పెద్ద మనిషికి ముందే తెలుసు కదా.. కేంద్రంలో బిజెపి పార్టీ కేవలం మత విశ్వాసాలతో ముందుకు వెళుతూ భారతదేశంలోని అన్ని రాష్ట్రాల్లో గవర్నర్ల వ్యవస్థను విచ్చిన్నం చేసి అధికారం దక్కించుకోవడానికి పూర్తిగా మనువాదాన్నే ముందుకు తీసుకొచ్చింది. అదే కోవలో మందకృష్ణను కూడా తెలుగు రాష్ట్రాల్లో మంచి వాక్చాతుర్యం గల నాయకుడిగా గుర్తించిన కేంద్రం వాడుకోవడానికి గట్టిగా పన్నాగాలు చేసింది. దళితుల్లో విచ్చిన్నం రేపడానికి కావలసినంతగా వాడుకున్నారు.. మాల మాదిగలను విడగొట్టిన తర్వాత ఇప్పటికీ మాల వాళ్లకు ఇంటి పేరు ఏది వర్తిస్తుందో అర్థం కాక కుల ధ్రువీకరణ పత్ర విషయంలో ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్న ఈ విషయంపై మందకృష్ణ మాదిగ మాట్లాడడు..!? ఇది పద్మశ్రీ గారికి అక్కర్లేదు!? కులం మతం దళితులు అంటరాని వాళ్ళం అంటూ ఇంకా దిగజారి పోయే మాటలు వల్లిస్తూ 70 సంవత్సరాల క్రితం జరిగిన వాటినే ఇప్పుడు జరుగుతున్నాయని చెబుతూ ఈ సమాజాన్ని ఎటువైపు మళ్లిస్తున్నారు? అసలు అంబేద్కర్ పైనే కామెంట్ చేసిన ఈ పెద్దమనిషి... ఆయన మాలవాడు కాదు? అని రాజ్యాంగ నిర్మాతనే తప్పు పట్టిన ఈ పెద్ద మనిషికి.. కులం మతం అర్చకత్వం అంటరానితనం ఇలాంటివన్నీ మరొక్కసారి తన ఉనికిని చాటుకోవడానికి ఉద్యమానికి నిత్యం ఆద్యం పోసే వస్తువులను గుర్తించారేమో.... అందుకనే ఈ పెద్ద మనిషి అలాంటి విషయాలనే మాట్లాడుతుండడంపై ప్రజలు అర్థం చేసుకోవాలి..

వాస్తవానికి కులం మతం ఇవి ఇప్పటికీ దళితుల పైన ప్రభావాన్ని చూపుతున్నాయి. వాటిపై ఆధిపత్యం చెలాయించడం కోసం విజ్ఞానంతోనే మనం ముందుకు వెళ్లాలి. భారత రాజ్యాంగానికి లోబడి ఉన్నత పదవుల్లో కొనసాగేలా విజ్ఞానాన్ని సంపాదించుకొని సమాజాన్ని విజ్ఞానం వైపు నడిపించాలి. అంతేకానీ ఈ సమాజాన్ని కులమతాల గొడవలతో అర్చకత్వం మాకు లేదా అనే ఒక నెపంతో సమాజాన్ని పద్మశ్రీ మందకృష్ణ ఎటువైపు తీసుకెళ్తున్నారు? కులం మతం గురించి మాట్లాడేటప్పుడు దాని వెనుక పాలకులు ఎలాంటి తప్పుడు నిర్ణయాలకు పాల్పడుతున్నారో వాటిని ఖండించే బాధ్యత ఈ పెద్ద మనిషికి లేదా? సుప్రీంకోర్టు తీర్పు తీర్చడంలో జరిగిన మోసాన్ని కేంద్రంలో అధికార పార్టీపై ఈ మందకృష్ణ ఎందుకు కౌంటర్ వేయలేకపోతున్నాడు? ఎందుకంటే గతంలో తన అనుచరులతో కలిసి ఏర్పాటు చేసుకున్న ఒక మీటింగ్లో మనం ఏ పార్టీలో ఉన్న అందరం కలిసి బిజెపికే ఓటు వేయాలి అని హితబోధ చేసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి!

వాస్తవానికి అందరం కులమత బేధాలు లేకుండా కలిసి తింటున్నాం. కలిసి బ్రతుకుతున్నాం. కలిసి ఉద్యోగాలు చేస్తున్నాం. కలిసి రాజకీయాలను చేస్తున్నాం రాజ్యాంగానికి లోబడి శాసనసభలో కూర్చుంటున్నాం. ఇంతవరకు బాగానే ఉన్నా ఇంకా కులం మతం పూర్తిగా రూపు మార్చడానికి రాజకీయంగా సమూల మార్పు అవసరం. అంతేకానీ సమాజంలో మంటను ఉసిగొల్పే పెద్ద మనుషుల మనస్తత్వం వైఖరి కచ్చితంగా మారాల్సిందే... కులానికి మతానికి అర్చకత్వానికి ఇప్పుడొచ్చిన అంత ఆవశ్యకత ఏంటి? అర్చకత్వం వైపు ఎస్సీలు, బీసీలు, ఎస్టీలు, ఉవ్విళ్లూరుతున్నారా? అదీ ఎవడికి కావాలి? అర్చకత్వం అలా చెప్పుకుంటూ పోతే భారతదేశంలో మన రాష్ట్రంలోనే కొన్ని కొన్ని ఆలయాల్లో ఎస్సీలు అర్చకులుగా వ్యవహరిస్తున్నారు! అది పక్కన పెడితే అసలు కులం మతం మీద రాద్ధాంతం చేయడం చర్చించడం సమస్యని సాధారణ ప్రజల్లో ఉద్వేగాన్ని ఆవేశాన్ని రెచ్చగొట్టడమే! దీనివల్ల ఎవరికి లాభం ఎవరికి నష్టం అని ప్రజలు ఒక్కసారి అంచనా వేసుకోవాలి!? వీటన్నింటినీ జయించాలి అంటే చదువుకోవాలి అంబేద్కర్ చెప్పినట్టుగా ఇలాంటి వాళ్ళు ఎంతోమంది రాజ్యాంగాన్ని విచ్చిన్నం చేయడానికి పుట్టుకొస్తారు అని ఆనాడే చెప్పిన ఆ మహానుభావుడిని పూర్తిగా చదవాల్సిందే!? పట్టపగడివేషగాళ్లు వస్తూనే ఉంటారు ఇలాంటి ఎన్నో సున్నితమైన విషయాల మీద నిప్పు రాజేస్తూ ఉంటారు! సభ్యసమాజమ ఈ సమాజంలో నువ్వు నేను అందరం సమానం! ఇంకా హిందువు క్రిస్టియన్ ముస్లిం అంటూ కొట్లాడుకోవడం పోట్లాడుకోవడం ఒకరికొకరు హేళన చేసుకోవడం అవివేకం! ఇలాంటి విషయాలపై చర్చించడం మూర్ఖత్వం! మాట్లాడుకోవాలి అది రాజకీయంగా చర్చ జరగాలి. సమూలంగా శాసనసభ లోక్సభ రాజ్యసభ ఇలాంటి సభల్లో చర్చించి బిల్లును ప్రవేశపెట్టి ఇలాంటి సమస్యలను అంతమొందించాలి! అది జరిగే పనేనా? అందుకే విద్యను ఆర్జించి ఆర్థిక రంగంలో అగ్రగామిగా నిలుస్తూ నీ సమాజాన్ని విజ్ఞానవంతులుగా చేస్తే ఇలాంటి అంటరానితనం కులం అన్నిసమూలంగా తుడిచిపెట్టుకుపోతాయి... దేశమా నిలకడగా ఆలోచించు.. భారత జనాంగమా చెప్పుడు మాటలకు ఆవేశ పడకు! సమాజాన్ని ప్రజలకు ప్రభుత్వాలకు వివరంగా వివరించే నాలుగో స్తంభం మీడియా ఇలాంటి విషయాలపై చర్చలు పెట్టి మీ రేటింగ్ లు పెంచుకోవాలని చూడకూడదు... అయ్యా పద్మశ్రీ దేశంలో ఎన్నో సమస్యలు ఉన్నాయి ఈ దళిత సమస్యలు పక్కనపెట్టి కులమతాలు అనే సున్నితమైన విషయాలపై కాకుండా మౌలిక వసతులు వాగ్దానాల అమలు ఇలాంటి ఎన్నో ప్రజా ప్రయోజనాలు ప్రెస్లో పెట్టుకొని పోరాటం చేస్తే బాగుంటుంది జీవితానికి అర్థం ఉంటుంది.

## అమరావతికి.. ఆమోదముద్ర

ప్రాంతీయ, జాతీయ పార్టీలన్నీ ఏకగ్రీవంగా అమరావతికి మద్దతు పలికాయి. కాంగ్రెస్, బీజేపీ, టీడీపి, జనసేన వంటి పార్టీలతో పాటు తెలంగాణ నుంచి భారత్ రాష్ట్ర సమితి కూడా ఈ బిల్లును సమర్థించింది. గత 12 ఏళ్లుగా కొనసాగుతున్న అనిశ్చితికి ఈ బిల్లు ముగింపు పలుకుతుందని ఎంపీలు పేర్కొన్నారు. అయితే, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాత్రం బిల్లును తీవ్రంగా వ్యతిరేకించింది. మూడు రాజధానుల ప్రతిపాదనను ప్రస్తావిస్తూ, రాజధాని ప్రాంత రైతులకు ఇచ్చే పరిహారంపై స్పష్టత లేదని ఆరోపిస్తూ సభ నుంచి వాకౌట్ చేసింది.చర్చను ప్రారంభిస్తూ కాంగ్రెస్ నేత రేణుకా చౌదరి, ఏపీ రాజధాని విషయంపై ఇంతకాలం ఆలస్యం జరగడం పార్లమెంటు వైఫల్యమని, ఇప్పటికైనా సరైన నిర్ణయం తీసుకున్నందుకు సంతోషమని వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి కె. రామ్మోహన్ నాయుడు ప్రసంగిస్తూ, ఇది కేవలం పరిపాలనాపరమైన నిర్ణయం కాదని, ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవ ప్రతీక అని ఉద్వేగభరితంగా చెప్పారు. 2014 విభజన గాయాలను ఈ చట్టం మాన్పుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంపీలు తమ ప్రసంగాల్లో అమరావతిని బెంగళూరు, హైదరాబాద్ తరహాలో అభివృద్ధి చేయాలని కేంద్రాన్ని కోరారు. తెలంగాణ ప్రాంత ప్రయోజనాలకు భంగం కలగకుండా, పొరుగు రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందడం తమకు ఇష్టమని బీఆర్ఎస్ ఎంపీలు స్పష్టం చేశారు. ఏపీకి ఒక శాశ్వత రాజధాని ఉండటం వల్ల తెలుగు రాష్ట్రాల మధ్య మరింత సహకారం పెరుగుతుందని వారు అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా ఉన్న దాదాపు అన్ని ప్రధాన పార్టీలు అమరావతికే ఓటు వేయడంతో సభలో ఒక అరుదైన ఏకాభిప్రాయం కనిపించింది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ చర్చకు సమాధానం ఇస్తూ, ఏపీ ప్రజల ఆకాంక్షలకు గౌరవం ఇస్తూనే ఈ చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు. కేవలం వాయిస్ ఓట్ ద్వారా బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందినట్లు చైర్మన్ ప్రకటించడంతో ఏపీలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పార్లమెంటులోని ఉభయ సభలు ఈ బిల్లును ఆమోదించినందున ఇది తదుపరి దశలో రాష్ట్రపతి ఆమోదం కోసం వెళ్తుంది. రాష్ట్రపతి సంతకం చేసిన వెంటనే ఇది చట్టంగా మారుతుంది. తదనంతరం కేంద్ర ప్రభుత్వం గెజెట్ నోటిఫికేషన్ విడుదల చేస్తుంది. దీనివల్ల ఏపీ రాజధానిగా అమరావతికి రాజ్యాంగబద్ధమైన హోదా లభిస్తుంది. భవిష్యత్తులో ఏ ప్రభుత్వం వచ్చినా ఈ చట్టాన్ని మార్చడం దాదాపు అసాధ్యమవుతుంది.

**రాజధాని బిల్లును వ్యతిరేకిస్తూ రాజ్యసభలోనూ వైసీపీ వాకౌట్**

రాజ్యసభలో అమరావతి రాజధాని చట్టబద్ధత బిల్లుపై జరిగిన చర్చలో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించారు. రాజ్యసభలో అమరావతి బిల్లుపై మాట్లాడిన వైవీ సుబ్బారెడ్డి, ఈ మొత్తం వ్యవహారాన్ని ఒక పెద్ద డ్రామాగా అభివర్ణించారు. ప్రస్తుత రూపంలో ఉన్న అమరావతి బిల్లును తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టం చేశారు. అసలు రాజధాని నిర్ణయం అనేది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని గతంలో కేంద్రమే అఫిడవిట్ దాఖలు చేసిందని గుర్తు చేస్తూ, మరి ఇప్పుడు కేంద్రం ఈ బిల్లును ఏ ప్రాతిపదికన ప్రవేశపెట్టిందని ఆయన ప్రశ్నించారు. కేంద్రానికి బిల్లు పెట్టే అధికారం లేదన్నారు. అమరావతి నిర్మాణం వల్ల రాష్ట్రంపై పడే ఆర్థిక భారాన్ని ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. ఒక్కో ఎకరా అభివృద్ధికి రూ. 2 కోట్లు ఖర్చవుతుందని చెబుతున్నారని, మొత్తం ప్రాజెక్టుకు అవసరమైన రూ. 2 లక్షల కోట్లు ఎక్కడి నుంచి తెస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే వడ్డీల రూపంలోనే రూ. 20 వేల కోట్లు చెల్లించాల్సిన దుస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అమరావతిలో ప్రతి చదరపు అడుగుకు రూ. 12 వేలకు పైగా ఖర్చు చేస్తున్నారని, దీని వెనుక పెద్ద ఎత్తున కుంభకోణాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసమే తమ ప్రభుత్వం గతంలో మూడు రాజధానుల నిర్ణయం తీసుకుందని వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. అమరావతిని శాసన రాజధానిగా ఉంచుతూనే, విశాఖపట్నాన్ని ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా, కర్నూలును జ్యుడీషియల్ క్యాపిటల్‌గా చేయాలన్నదే తమ విధానమని చెప్పారు. అమరావతి ప్రాంతం వరదలతో మునిగిపోతుందని ఇప్పటికే ఆధారాలు ఉన్నాయని, అటువంటి ప్రాంతంలో వేల కోట్లు కుమ్మరించడం సరైన నిర్ణయం కాదని వాదించారు. అసెంబ్లీలో సరైన చర్చ జరపకుండానే తీర్మానం చేశారని సుబ్బారెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వం కేవలం ఒక ప్రాంతానికే పరిమితమై మిగిలిన ప్రాంతాలను విస్మరిస్తోందని విమర్శించారు. తన ప్రసంగం అనంతరం, బిల్లుకు నిరసనగా వైవీ సుబ్బారెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ సభ్యులు రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు.

## హైదరాబాద్‌లో చికెన్ దొరకట్లే

కంపెనీలు రిటైల్ షాపుల యజమానులకు కిలోకు కేవలం రూ. 5 నుండి రూ. 7 వరకు మాత్రమే మార్జిన్ ఇస్తున్నాయి. అయితే, గత కొన్నేళ్లుగా షాపుల అద్దెలు, కరెంట్ బిల్లులు, పనివారి జీతాలు, మున్సిపల్ పన్నులు భారీగా పెరిగాయని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం కిలోకు రూ. 15 నుండి రూ. 20 మార్జిన్ ఇస్తేనే తాము బతకగలమని, లేదంటే నష్టాల్లో కూరుకుపోతామని వారు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని గ్రేటర్ చికెన్ మర్చంట్స్ అసోసియేషన్ ఈ సమ్మెకు పిలుపునిచ్చింది. బాయిలర్ చికెన్ కంపెనీలు సిండికేట్‌గా ఏర్పడి ధరలను నియంత్రిస్తున్నాయని, తక్కువ మార్జిన్‌తో చిన్న వ్యాపారుల పొట్ట కొడుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. చికెన్ ధరలు పెరిగినప్పుడల్లా వినియోగదారుల నుంచి విమర్శలు ఎదుర్కొనేది తామేనని, కానీ అసలైన లాభం మాత్రం పెద్ద కంపెనీలకే వెళ్తోందని రిటైలర్లు వాదిస్తున్నారు. ఈ మార్జిన్ పెంచే వరకు షాపులు తెరిచే ప్రసక్తే లేదని వారు భీష్మించుకుని కూర్చున్నారు. సమ్మె కారణంగా ఒక్క హైదరాబాద్‌లోనే రోజుకు సుమారు రూ. 10 కోట్ల నుండి రూ. 15 కోట్ల వరకు వ్యాపారం దెబ్బతింటుందని అంచనా. కేవలం మాంసం విక్రయాలే కాకుండా, చికెన్‌పై ఆధారపడిన హోటళ్లు, రెస్టారెంట్లు ,ఫాస్ట్ ఫుడ్ సెంటర్లపై కూడా ఈ ప్రభావం తీవ్రంగా పడింది. హోటల్ యజమానులు అధిక ధర చెల్లించి బయటి జిల్లాల నుండి చికెన్ తెప్పించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమ్మె ఎంతకాలం కొనసాగుతుందనేది ఇప్పుడు పెద్ద ప్రశ్న. కంపెనీ ప్రతినిధులు , రిటైలర్ల మధ్య చర్చలు జరుగుతున్నప్పటికీ, మార్జిన్ పెంపు విషయంలో ఇంకా ఒక స్పష్టత రాలేదు. ప్రభుత్వం జోక్యం చేసుకుని ఈ వివాదాన్ని పరిష్కరించాలని అటు వ్యాపారులు, ఇటు వినియోగదారులు కోరుతున్నారు. ఒకవేళ చర్చలు విఫలమైతే, ఈ సమ్మె మరింత కాలం కొనసాగే అవకాశం ఉంది.

# ముగిసిన సీతారామ స్వామి బ్రహ్మోత్సవాలు

- చివరిరోజు సంప్రదాయ కార్యక్రమాలతో అలరించిన కళాకారులు
- బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపిన ఆలయ సిబ్బంది



**జయభేరి, శామీర్ పేట్, ఏప్రిల్ 2:**

శామీర్‌పేట్ డివిజన్ పరిధిలోని దేవరయాంజాల్ గ్రామంలో వెలసిన శ్రీ సీతారామ స్వామి దేవస్థానంలో నిర్వహించిన బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. ఈవో వీరేశం పర్యవేక్షణలో గత నెల మార్చి 23న అర్చకులు కందాళ సీతారామాచార్యుల పలువురు దాతల ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజూ హోమాలు,ప్రత్యేక సేవలు,కోలాటం వంటి సాంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించారు.ఇక బుధవారం రాత్రి జాతర ఘనంగా నిర్వహించగా, గురువారం తెల్లవారుజామున స్వామివారి రథోత్సవం, చక్ర తీర్థం, పూర్ణాహుతి, దోపు సేవ, శ్రీ పుష్పయాగం నిర్వహించి ఉత్సవాలకు ముగింపు పలికారు. ఇక ఉత్సవాల ముగింపు సందర్భంగా మాజీ సర్పంచ్ గోల్డ్ శ్రీనివాస్ మరియు వారి మిత్ర బృందం కలిసి పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. అదేవిధంగా జాతీయ కళా మండలి అధ్యక్షుడు ఎన్ వై గిరి బృందం మరియు మహిళా కళాకారుల కోలాటం, ఆట పాటలతో భక్తులను అలరించారు. అనంతరం ఉత్సవాలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఆలయ సిబ్బంది ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ నాలిక యాదగిరి, దేవస్థానం మాజీ ఛైర్మన్లు దాసరి గోపాల్ రెడ్డి, పేండం లక్ష్మీనారాయణ, పన్నాల వీరారెడ్డి, పన్నాల సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ గోల్డ్ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ వలందాసు సునీత లక్ష్మి, జాతీయ కళామండలి అధ్యక్షుడు యన్ వై అశోక్, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు చింతల శ్రీనివాస్ రెడ్డి, మద్దుల శ్రీనివాస్ రెడ్డి, మామిడిపల్లి మధుసూదన్ రావు, బర్రెంకబావి కిషోర్ సాయిరెడ్డి, బర్రెంకబావి విష్ణువర్ధన్, పిన్నింటి ధర్మారెడ్డి, వలందాసు మురళి గౌడ్, మిర్యాలకర్ సాయి కుమార్, పన్నాల బాల్ రెడ్డి, పెద్ది కొండల్ రెడ్డి, బెబండి జంగారెడ్డి, పీసరి నవపాల్ రెడ్డి, తిరుపతి శంకర్ గౌడ్, డాక్టర్ సింగం రామరావు, పట్నం నర్సింహారెడ్డి, పోద్దుటూరి వెంకట నారాయణ రెడ్డి,పిన్నింటి సుధాకర్ రెడ్డి, మోటె బాలయ్య, బర్ల అనంతరెడ్డి,కట్ట రాంరెడ్డి, బక్కోళ్ల శ్రీనివాస్, బర్రెంకబావి పట్టాభిరెడ్డి, పట్నం రాంరెడ్డి, పొట్లచెరువు నాగులు, పన్నాల నితిన్ రెడ్డి, పన్నాల శ్రీపాల్ రెడ్డి, బర్ల నరేందర్ రెడ్డి,కుకునూర్ వినోద్, రంగప్పగారి నాగరాజ్ గౌడ్, నేమూరి రాంచందర్ గౌడ్, దండోత్కర్ రాజ్ మోహన్, అల్లే గంగాధర్, ఆకుల ఉమాపతి హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.




## ఘనంగా ఆంజనేయస్వామి జయంతి వేడుకలు

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని దేవరకద్ర మండలం గోపన్ పల్లిలో గురువారం ఆంజనేయ స్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూజారి మఠం సురేష్ స్వామి ఆధ్వరంలో ఈ కార్యక్రమాన్ని సాంప్రదాయ రీతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామికి పంచామృతాలతో విశేష అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు, పుష్పార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశేష దినోత్సవం సందర్భంగా స్వామివారిని సింధూరం, తమలపాకులతో అలంకరించి ఈ పూజలు నిర్వహించారు. అలాగే స్వామివారికి మహా మంగళహారతి, నైవేద్యము, తీర్థ ప్రసాదములు వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. పూజా కార్యక్రమాన్ని ఉద్దేశించి పూజారి మఠం సురేష్ స్వామి మాట్లాడుతూ ఆంజనేయ స్వామిని అర్చించటం వల్ల కోరిన కోర్కెలు నెరవేరుతాయని, చెడు కలలు రావని, అన్నింటా విజయం లభిస్తుందన్నారు. ఈ పూజా కార్యక్రమానికి గ్రామ యువకులు, మహిళలు, భక్తులు, భజనపరులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వ్యక్తి అదృశ్యం



**జయభేరి, హయత్ నగర్ :**

సంపర గ్రామం. పెద్దపూడి మండలం, తూర్పు గోదావరి జిల్లాకి చెందిన నాగిరెడ్డి సత్యనారాయణ(58), తండ్రి నాగిరెడ్డి సుబ్బారావు, అనే వ్యక్తిని బొమ్మతోటి హనుమంతరావు తండ్రి రామకృష్ణ, వృత్తి తాపీ మేస్త్రీ, నివాసం: ప్లాటు నెం.66, రోడ్డు నెం.2, శివగంగా కాలనీ, బాగ్ హయత్ నగర్ చేపడుతున్న ఇంటి నిర్మాణ పనుల్లో లేబర్గా పనిచేసేందుకు తేది: 31.03.2026 మంగళవారం నాడు హయత్ నగర్ కి తీసుకుని వచ్చి బాగ్ హయత్నగర్, శివగంగా కాలనీ నందు రూములో ఉంచటం జరిగినది. రూంలో నుండి బయటికి వెళ్లిన నాగిరెడ్డి సత్యనారాయణ సాయంత్రానికి కూడా తిరిగి రాలేదు. అతనికి ఎలాంటి ఫోన్ సౌకర్యం లేదు. అతడికి చదువు కూడా రాదు అని, నాగిరెడ్డి సత్యనారాయణని వెతికిపెట్టగలరని హనుమంతరావు పిర్యాదు పై కేసు నమోదు చేయనైనది.

### నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు ఒక్కటై..

# దేశానికి ఆదర్శంగా ఎదగాలి

**జయభేరి, హైదరాబాద్ :**



ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్రమంతటా గ్రామ సభలు జరుగుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రజలకు సందేశం అందించారు. "ప్రజా ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించి రెండు సంవత్సరాల మూడునెలలు పూర్తయ్యింది. ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ, గత పాలకుల తప్పిదాలను సరిచేస్తూ, సంక్షేమం, అభివృద్ధి విషయంలో రాజీపడకుండా మన ప్రభుత్వం పని చేస్తోంది.

మేం పాలకులం కాదు. సేవకులం అన్న భావనతో ప్రజల ఆకాంక్షలు, అవసరాలే కేంద్ర బిందువుగా నిత్యం శ్రమిస్తున్నాం. ప్రతి నిర్ణయంలో ప్రజల మేలు, సామాజిక బాధ్యత, రాష్ట్ర భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుంటున్నాం. ఉప ఎన్నికలు, పంచాయతీ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో వరుస విజయాలతో ప్రజా పాలనకు మీ ఆమోదం, మద్ధతు ప్రకటించారు. మీరు ఇచ్చిన ఈ ఫలితాలు మా బాధ్యతను మరింత పెంచాయి. ప్రభుత్వ పథకాలు అంటే కాగితాలపై కాదు. ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తేవాలన్నది మా సంకల్పం. ఆ ఉద్దేశంతోనే “ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక” పేరుతో కార్యక్రమాన్ని ప్రారంభించాం. మార్చి 6 నుండి 99 రోజుల పాటు, గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు, అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం ఒక ఉద్యమంలా సాగుతోంది. ఊరు వాడ సమస్యల పరిష్కారమే పరమావధిగా ప్రతి అధికారి పని చేయాలి. వేగంగా ఫైళ్ల క్లియరెన్స్, ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత, నిర్ణయాల్లో పారదర్శకత ఉండాలి. మహాలక్ష్మి ఉచిత బస్సు సౌకర్యం, ₹ 500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్ళు, మహిళా సాధికారత వంటి పథకాలు అర్హులకు చేరేలా ఈ కార్యక్రమం జరగాలి.

“తెలంగాణ రైజింగ్ - 2047” విజన్‌తో ఆర్థికంగానే కాకుండా, అన్నీ రంగాల్లో తెలంగాణను ప్రపంచంలో నంబర్ వన్‌గా నిలపాలన్నది మన సంకల్పం. ఈ సంకల్పంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి. CURE, PURE, RARE గా రాష్ట్రాన్ని వర్గీకరించుకున్నాం. వాటి పరిధిలో సేవా, తయారీ, వ్యవసాయ రంగాల్లో ప్రపంచానికి ఆదర్శంగా మనం ఎదగాలి. ఈ 99 రోజుల కార్యాచరణ ఒక సాధారణ కార్యక్రమం కాదు. ఒక దీక్ష. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు ఒక్కటై... దేశానికి, ప్రపంచానికి ఆదర్శంగా ఎదగాలి. ఇదే నా కల. ఆ కలను సాకారం చేయడంలో ప్రతి తెలంగాణ బిడ్డ భాగస్వామి కావాలి".

# జీవో ఎంఎస్ నెంబర్ 60 రద్దు చేయాలి

- తెలంగాణ టూర్స్ & ట్రావెల్ బస్సు ఓనర్అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా

**జయభేరి, మేడిపల్లి :**




మూలిగే నక్క మీద తాటి గుండు పడ్డట్టు రాష్ట్ర ప్రభుత్వం రవాణాశాఖ ప్రైవేట్ టూర్స్ అండ్ ట్రావెల్స్ వాహనాల ఫిట్నెస్ రెన్యువల్ చేసేటప్పుడు ఇష్టానుసారంగా రేడియం చార్జీలు ఒక క్రమ పద్ధతి లేకుండా రేడియం ప్రైవేట్ కాంట్రాక్టు వ్యక్తులు దండుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన జీవో ఎంఎస్ నెంబర్ 60 నీ రద్దు చేయాలని తెలంగాణ టూర్స్ అండ్ ట్రావెల్స్ బస్సు ఓనర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండ గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఉప్పల్ ఆర్టీవో ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ..ప్రజా పాలన ప్రజల సంక్షేమమే అని గొప్పలు చెప్పే రాష్ట్ర ప్రభుత్వము పేదల కన్నీటికి కారణమవుతుందని పేదల పక్షాన ఉండవలసిన ప్రభుత్వం కొత్త జీవోలు తెచ్చి ఇష్టానుసారంగా వాహనాల రేడియం రేట్లు పెంచడం అనేది సామాన్య మానవుని కి భారంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలు యువకులకు ఉద్యోగాలు ఇవ్వకపోయినా ప్రైవేట్ ట్రావెల్స్ రంగాల్లో ఉద్యోగాలు కల్పిస్తున్న మాకు కొత్త జీవోల పేరిట జీవనోపాధి లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేడియం మీటర్ కు 50 రూపాయలను నుంచి 60 రూపాయలకు చొప్పున ఉంటుందని కానీ ఆర్టీవో ఆఫీస్ దగ్గర కాంట్రాక్టు వ్యక్తులు మీటర్ కు 150 రూపాయల నుండి 200 రూపాయల చార్జీలు వేసి వాహనానికి 5000 నుంచి 10000 రూపాయలు వసూలు చేస్తూ వాహనదారులకు మరింత భారాన్ని వేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం కూడా ఇలాగానే రేట్లు పెంచితే టిఆర్ఎస్ ప్రభుత్వం పతనమైందని.... మళ్లీ ఈ ప్రభుత్వం కూడా ప్రజా ప్రభుత్వం అని చెప్పి ఇష్టాన్ని రీతిగా రేడియం రేట్లను పెంచినట్లయితే ప్రభుత్వం పతనం తప్పదని. జీవో నెంబర్ 60 ను రద్దుచేసి ప్రజా ప్రభుత్వం అని నిరూపించుకోవాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టూర్స్ అండ్ ట్రావెల్స్ బస్సు ఓనర్ అసోసియేషన్ అధ్యక్షులు కొండ గోపాల్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ నరసింహారెడ్డి, కోశాధికారి కొండల్ రెడ్డి, ఉపాధ్యక్షులు పోకల మల్లేష్, హరీష్, రెడ్డప్ప, బాల్ రెడ్డి, సంతోష్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ప్రభాకర్, వెంకటేష్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ ఫలాలు అర్హులకు అందజేస్తాం

**జయభేరి, యాదగిరిగుట్ట :**



ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేస్తామని కౌన్సిలర్ ముఖ్యర్ల మల్లేష్ యాదవ్ అన్నారు. గురువారం యాదగిరిగుట్ట పట్టణంలోని 11వ వార్డులో ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 కార్యచరణలో బాగంగా నిర్వహించిన 11వ వార్డు సభకు యాదగిరిగుట్ట మున్సిపల్ అకౌంటెంట్ అధికారి రంజిని హాజరయ్యారు. జాతీయ గీతాలపనతో సభను ప్రారంభించారు. కౌన్సిలర్ ముఖ్యర్ల మల్లేష్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు ప్రతి అర్హుడికి చేరేలా చూడడం జరుగుతుందని అన్నారు. రైతు రుణ మాఫీ, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు వడ్డీ లేని రుణాలు పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, వైద్య సేవలు, డైట్ చార్జీల పెంపు, తదితర పథకాలకు సంబంధించి లబ్దిదారుల పూర్తి వివరాలను ప్రజలకు తెలిపారు. రైతు భరోసా, గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలు ప్రజలకు చేరేలా అధికారులు కృషి చేస్తున్నారని అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకాలు వినియోగించుకోవాలన్నారు. ప్రజల నుండి సమస్యలు అడిగి తెలుకున్నారు. శిథిలా వ్యవస్థలో ఉన్న వాటర్ ట్యాంక్ ను తొలగించుట నూతన సీసీ రోడ్డు,ఆసరా పింఛన్లు, డ్రైనేజీలు, నల్లా సమస్యలు,పారిశుధ్యం, అంగడి బజార్ దగ్గర సీసీ కెమెరా, ప్రతి రోజు పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని సభలో చర్చించారు. ఈ వార్డు సభలో డీసీసీ డాక్టర్ సెల్ ఛైర్మన్ గిరిధర్, డీసీసీ జిల్లా కార్యదర్శి ఎండి. సలీమ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శివ నాగేందర్, రాజు, శ్రీను, సలామ్, గౌళికార్ రాజేష్, పులుగం శోభరాణీ పాల్గొన్నారు.



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ పరిధిలో నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ FCDA కార్యాలయం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ YISU కి సంబంధించిన భవన సముదాయాల నిర్మాణ పురోగతిని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పరిశీలించారు. ఫ్యూచర్ సిటీ అథారిటీ భవన నిర్మాణ పనులతో పాటు వాటి డిజైన్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే, స్కిల్స్ యూనివర్సిటీకి చెందిన పలు భవనాలను పరిశీలించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి వెంట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, స్కిల్స్ యూనివర్సిటీ వైస్ చాన్సెలర్ వీఎల్వీఎస్ఎస్ సుబ్బారావతో పాటు ఇతర అధికారులు ఉన్నారు.

**జయభేరి, హైదరాబాద్**

## కలెక్టర్ మనూ చౌదరిని కలిసి వినతి పత్రం

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**జయభేరి, కాప్రా :**

చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఆదర్శ్ నగర్ ప్రాంతంలో భూమి తీసుకొని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మిస్తామని గతంలో హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటి వరకు అమలు కాలేదని స్థానికులు తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్ మనూ చౌదరి ఐఏఎస్ ని కలిసి వినతి పత్రం సమర్పించడం జరిగింది. డబుల్ బెడ్ కోసం భూమి కోల్పోయిన వారికి వెంటనే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ఇవ్వాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో BRS పార్టీ డివిజన్ అధ్యక్షుడు మహేష్ గౌడ్ స్థానిక నాయకులు మత్సగిరి, బాల రాజు, రాజు మహిళలు పట్ట పొందిన వారు తదితరులు పాల్గొన్నారు.

## మల్లాపూర్ జిల్లా పరిషత్ హై స్కూల్‌ల్లో బయోగ్యాస్ ప్లాంట్



**జయభేరి, ఉప్పల్ :**

నాచారం ఇండస్ట్రీలోని ప్రముఖ కంపెనీ వోయిత్ టర్బో ప్రైవేట్ కంపెనీ లిమిటెడ్ వారు ఐదు లక్షల రూపాయల CSR (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులతో మల్లాపూర్ జిల్లా పరిషత్ హై స్కూల్‌ల్లో బయోగ్యాస్ ప్లాంటును, ఆర్వో ప్లాంటును ప్రారంభించిన స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం వల్ల మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన వంట గ్యాస్ ఖర్చు తగ్గుతుందని, విద్యార్థులకు పునరుత్పాదక ఇంధనంపై అవగాహన కలుగుతుందని ఎమ్మెల్యే అన్నారు, ఐదు లక్షలతో గ్యాస్ ప్లాంట్, ఆర్వో వాటర్ ప్లాంట్, లైబ్రరీలో అల్మారాలు, కుర్చీలు అందించిన వోయిత్ టర్బో కంపెనీ ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు శ్రీలత, ఇతర అధ్యాపకులు, వోయిత్ టర్బో కంపెనీ ప్రతినిధులు ఈశ్వర్ ప్రసాద్ వైస్ ప్రెసిడెంట్, మోహనరెడ్డి జనరల్ మేనేజర్, రాజశేఖర రెడ్డి జనరల్ మేనేజర్, ఇంద్రజ మహేష్. నరసింగ రావు, స్థానిక నాయకులు తండా వాసుగుడ్, ఫైళ్ల ప్రవీణ్ కుమార్, ధర్మారెడ్డి, కాసం రాజిరెడ్డి దుల్మిట్టా దయాకర్ రెడ్డి, మెండ రఘువరన్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరా పార్క్ వద్ద ధర్నా



**జయభేరి, ఉప్పల్ :**

హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. కోఆపరేటివ్ కంపెనీలు రిటైల్ చికెన్ షాపులకు సరైన మార్జిన్ ఇవ్వకపోవడం వల్ల వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పెరుగుతున్న ఖర్చుల నడుమ తక్కువ మార్జిన్‌తో వ్యాపారం కొనసాగించడం కష్టసాధ్యమైందని తెలిపారు. రిటైల్ వ్యాపారులు నష్టాల్లో నడుస్తున్న పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం, సంబంధిత సంస్థలు వెంటనే స్పందించి న్యాయమైన, సరైన మార్జిన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యాపారుల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు పిలుపునివ్వడం తప్ప మరో మార్గం లేదని పేర్కొన్నారు. రిటైల్ వ్యాపారులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# చెక్కుతో పాటు తులం బంగారం ఇవ్వాలి

- కల్యాణ లక్ష్మి, షాది ముభారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ మునిసిపల్ కార్యాలయంలో ఉప్పల్ మండలానికి చెందిన 172 మందికి కల్యాణ లక్ష్మి మరియు షాది ముభారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెక్కుల పంపిణీ కార్యాలయం పారదర్శకంగా జరగాలి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన విధంగా లక్ష నూట పదహారు రూపాయల తో తులం బంగారం ఇవ్వాలి అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ,పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధికి బాటలు వేద్దాం

- వేములపల్లి సర్పంచ్ గుమ్మడవెల్లి రవి



**జయభేరి, దంతాలపల్లి, ఏప్రిల్ 02 :**

మండలం వేములపల్లి గ్రామంలో గురువారం జరిగిన గ్రామసభ జరిగింది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివేదికతో ప్రారంభమై గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను చదివి వినిపించారు గ్రామ సర్పంచ్ గుమ్మడవెల్లి రవి మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ అభివృద్ధికి సహకరిస్తూ ఐక్యమత్యంతో మన గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామని అన్నారు గ్రామంలో ఇప్పటికి ఇందిరమ్మ ఇళ్ళను ఇవ్వడం జరిగిందని అదేవిధంగా మహిళా సంఘాల ద్వారా మహిళలకు లోన్లను కూడా అందించడం జరిగిందని గ్రామంలో విద్యుత్తు విద్య అన్ని సదుపాయాలను కల్పించడానికి అన్ని విధాల రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అందుకు మనం అభివృద్ధి ఫలాలు పొందడానికి ఐకమత్యంతో కొనసాగుదామని అన్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ శ్రీధర్, ఉప సర్పంచ్ కుర్యావుల ప్రసన్న కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకన్న, వార్డు మెంబర్లు గంగయ్య ఎల్లయ్య రాములమ్మ,మల్లిక, గ్రామ ప్రజలు గుమ్మడవెల్లి పరిసయ్య, వెంకన్న బాబు, పరిషయ్య సురేందర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

# హెల్మెట్ ధరించాలని బైక్ ర్యాలీ

- దంతాలపల్లి ఎస్సై పిల్లల రాజు



**జయభేరి, దంతాలపల్లి, ఏప్రిల్ 02 :**

మహబూబాబాద్ జిల్లా SP శబరిష్ గారి ఆదేశాల మేరకు, మండల పరిధిలోని రామానుజపురం, లక్ష్మీపురం, దొనకొండ గ్రామాల ద్విచక్ర వాహనదారులతో ఎలిమెంట్ ధరింపజేసి భారీ ర్యాలీని నిర్వహించిన దంతాలపల్లి ఎస్సై పిల్లల రాజు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని అరైవ్ అలైవ్ ప్రోగ్రాంలో భాగంగా ద్విచక్ర వాహనాలు కలిగి ఉన్న వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, సి.సి కెమెరాల తో పర్యవేక్షణ, గంజాయి రహిత గ్రామాలుగా ఆయా గ్రామపంచాయతీలు తీర్మానం చేయడం జరిగింది, కావున ఎస్ఐ గారు మరియు పోలీస్ సిబ్బంది ఆ గ్రామాల పరిధిలో బందోబస్తు నిర్వహిస్తూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించడం జరుగుతుంది, గ్రామాల ప్రవేశం వద్ద నో ఎంట్రీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం జరిగింది, అలాగే ఇట్టి కార్యక్రమంలో భాగంగా రామానుజపురం గ్రామంలో స్థానికులతో కలిసి ఎస్ఐ గారు హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీ తో అవగాహన కల్పించడం జరిగింది, ఇట్టి కార్యక్రమంలో రామానుజపురం గ్రామ సర్పంచ్ దామోదర్ రెడ్డి, ఉపసర్పంచ్ మల్లం మౌనిక శ్రీను, గ్రామస్తులు, మరియు పోలీసు సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# శ్రీసాయి కాటన్ ఇండస్ట్రియల్ భూమి పూజ



**జయభేరి, చందంపేట :**

చందంపేట మండలం గన్నెర్లపల్లి గెట్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న శ్రీసాయి కాటన్ ఇండస్ట్రియల్ నిర్మాణం భూమి పూజ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో కాటన్ మిల్ ఏర్పాటు చేయడం అభినందనీయం అని ఆయన అన్నారు. పత్తి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు TVN రెడ్డి , మాజీ సర్పంచ్ కేతావత్ శంకర్ నాయక్, బొడ్డుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పేదవారికి పట్టెడన్నం పెట్టాలన్న ఉద్దేశంతోనే సన్నబియ్యం పథకం ప్రారంభం

- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ వెల్లడి
- ఉంద్యాలలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక
- జిల్లా కలెక్టర్ తో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్



**జయభేరి, దేవరకద్ర :**


ప్రతి పేద కుటుంబానికి భద్రత ఇవ్వాలన్న ఉద్దేశంతో వచ్చే జూన్ 2వ తేదీన ఇందిరమ్మ కుటుంబ భీమా జీవిత పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని చిన్నచింతకుంట మండలం ఉంద్యాల లో గురువారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామ సభకు జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా, వివిధ శాఖల అధికారుల తో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రసంగించారు.దేశంలోనే రేషన్ ద్వారా పేదలకు సన్నబియ్యం ఇస్తున్న చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిది అని అన్నారు.పేదవారికి పట్టెడన్నం పెట్టాలన్న ఆలోచనతో సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు.రాష్ట్రంలోని 1 కోటి 15 లక్షల కుటుంబాలకు భరోసానిస్తూ, ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కలిపిస్తూ విప్లవాత్మక పథకానికి శ్రీకారం చుట్టామన్నారు.గత ప్రభుత్వం చేసిన అప్పులకు మిత్తి కట్టుకుంటూ... ఒక్కొక్కటిగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామన్నారు. ఇచ్చిన మాట మేరకు మహిళలకు ఆర్థిక స్వాలంబన కల్పిస్తూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించి, ఇప్పటివరకు మహిళలకు 10,000 వేల కోట్ల రూపాయలు ఆదా చేయడం జరిగిందన్నారు.10 లక్షల వరకు ఆరోగ్య శ్రీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 లకే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామన్నారు.

21 వేల కోట్లతో రైతులకు ఏకకాలంలో 2 లక్షల రుణమాఫీ చేశాం, రుణమాఫీతో పాటు వరి ధాన్యానికి 500 రూపాయల బోనస్ ఇవ్వడం జరిగిందన్నారు. పేద విద్యార్థులు పస్తులు ఉండొద్దన్న లక్ష్యంతో, విద్యార్థులకు పౌష్టికాహారం అందించేలా జూన్ 2వ తేదీ నుండి ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభిస్తున్నాం, ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించడం జరిగిందన్నారు.పదేళ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం ఉంద్యాల గ్రామంలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించలేదు, ఉంద్యాల గ్రామంలో మొదటి విడత 33 ఇండ్లు ఇచ్చాము, ఈ ఏప్రిల్ లో రెండో విడత ఇండ్లు ఇస్తామన్నారు.పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించారు, ఉంద్యాల గ్రామంలో ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థలో ఉన్న దుస్థితిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి 33 లక్షల మంజూరు చేయించి నూతన పాఠశాల భవన నిర్మాణ పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. పాఠశాలలో అన్ని సబ్జెక్టులకు టీచర్లను అలట్ చేయించాం, వచ్చే విద్యా సంవత్సరం లో నూతన పాఠశాల భవనాన్ని ఘనంగా ప్రారంభించుకుందామన్నారు.ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం గ్రామ సభలకు శ్రీకారం చుట్టింది, పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం, గ్రామ సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారాలు కనుగొనడం, ప్రభుత్వ పథకాల అమలును సమీక్షించడం ఈ కార్యక్రమ ముఖ్య లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు.ఇచ్చిన హామీలే కాకుండా మేనిఫెస్టోలో ఇవ్వని ఎన్నో పథకాలు అమలు చేస్తున్న ప్రజా ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండి ఆశీర్వదించండి. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామి జయంతి సేవా కార్యక్రమాలు

**జయభేరి, మేడిపల్లి :**



మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడలో శ్రీ అయ్యప్ప స్వామి జయంతి సందర్భంగా భక్తి శ్రద్ధలతో మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. శ్రీ ధర్మ శాస్త్ర అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో, గురు స్వామి బాబు యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అయ్యప్ప స్వామి జయంతి వంటి పర్వదినాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సమాజంలో మానవతా విలువలు పెంపొందుతాయని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రాజశేఖర్ రెడ్డి, శ్రవణ్ కుమార్, లింగస్వామి, శేఖర్ రెడ్డి లను అయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మధుసూదన్ రెడ్డి, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు ప్రభు, అశోక్, చిర్ర సంతోష్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు బండారి రవీందర్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, నాయకులు పాశం బుచ్చి యాదవ్, పాశం రాజు, వేణుగోపాల్ శర్మ, మేడ్చల్ డ్రగ్ ఇన్స్పెక్టర్ అంబేద్కర్, శ్రీ శాస్త్ర అయ్యప్ప సేవాసమితి సభ్యులు సంతోష్, నాగేష్, భాను, శ్రీనివాస్, మహేష్, ప్రవీణ్, సురేష్, నవీన్, శ్రీకాంత్, సాయి తదితరులు భక్తులతో కలిసి పాల్గొని మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కింగ్ బుద్ధ హాలీవుడ్ ఫిల్మ్ టైటిల్ సాంగ్ లాంచ్

- కింగ్ బుద్ధ హాలీవుడ్ ఫిల్మ్ సాంగ్ ను లాంచ్ చేసిన శ్రీలంక కేంద్రమంత్రి సునీల్ సేనేవి



**జయభేరి, హైదరాబాద్ :**

హైదరాబాద్ ఐటిసి కాకతీయ జరిగిన ఫంక్షన్లో శ్రీలంక బుద్ధిజం రిలీజియన్స్ కేంద్ర శాఖ మంత్రి డాక్టర్ సునీల్ సేనేవి కింగ్ బుద్ధ వుయ్ వాంట్ వరల్డ్ పీస్ అనే టైటిల్ సాంగ్ ను అధికారికంగా ప్రారంభించారు. ఇరాన్, ఇజ్రాయిల్ ఉక్రెయిన్ రష్యా తో పాటు 50 దేశాల్లో జరుగుతున్న యుద్ధాన్ని ఆపాలని కింగ్ బుద్ధ వుయ్ వాంట్ వరల్డ్ పీస్ సత్యా రెడ్డి చేస్తున్న గొప్ప ప్రయత్నాన్ని ఆయన కొనియాడారు. ఈ చిత్రాన్ని అమెరికాలో ప్రారంభించి థాయిలాండ్ మలేషియా వియత్నాం కాంబోడియా లావోస్ ఇండోనేషియా లాంటి బుద్దిస్ట్ దేశాల్లో షూటింగ్ జరుపుకోవడం హర్షనీయమని ఆయన అన్నారు. త్వరలో తమ శ్రీలంక దేశంలో షూటింగ్ జరుపుకోవడానికి పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని ఆయన అన్నారు.

ప్రపంచ చరిత్రలో ఇన్ని బౌద్ధ దేశాల్లో షూటింగ్ జరుపుకుంటున్న ఏకైక చిత్రంగా కింగ్ బుద్ధ నిలిచిపోతుందని ఆయన అన్నారు. అన్ని బౌద్ధ దేశాల సహాయ సహకారాలు ఈ చిత్రానికి అందిస్తారని ఆయన ఆశించారు. అనుబాంబు దాడులకు గురైన హీరోషిమా, నాగసాకి ఇప్పటికీ కోలుకోలేదని ఆయన గుర్తు చేశారు. మూడో ప్రపంచ యుద్ధం రాకుండా ఉండాలన్న ప్రపంచం శాంతి మార్గంలో నడవాలన్నా ప్రపంచానికి బుద్ధిజమే ఏకైక మార్గం అని ఆయన అన్నారు. ప్రపంచ శాంతి కోసం ప్రపంచవ్యాప్తంగా వేలాదిమంది బౌద్ధ బిక్షువులు పీస్ వాక్ చేస్తున్నారని కోట్లాదిమంది ప్రజలు వారిని ఆదరిస్తున్నారని ఆయన అన్నారు. కింగ్ బుద్ధ హాలీవుడ్ మూవీలో చిత్రీకరించిన సీన్లు కొన్ని తను చూసానని దర్శకుడు సత్యారెడ్డి అద్భుతంగా చిత్రీకరించాడని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి సునీల్ శనివిని కింగ్ బుద్ధ హాలీవుడ్ చిత్ర యూనిట్ పూలమాలలతో, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కింగ్ బుద్ధ చిత్ర దర్శకుడు సత్యారెడ్డి మాట్లాడుతూ.. 30 సంవత్సరాల తన సినీ జీవితంలో కింగ్ బుద్ధ చిత్రం ద్వారా గౌతమ బుద్ధుని చరిత్రను ప్రపంచానికి అందించటంతో తన జన్మ ధన్యమవుతుందని ఆయన అన్నారు. 2027 లో ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా 100 భాషలకు పైగా విడుదల చేస్తామని ఆయన చెప్పారు. ప్రపంచంలో ఇంతవరకు రాని అత్యుత్తమ సాంకేతికను చిత్రానికి వాడుతున్నామని ఆయన తెలియజేశారు. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగులోని గౌతమ బుద్ధుని జననం, బాల్యం విద్యాభ్యాసానికి సంబంధించిన సన్నివేశాలు నేపాల్ దేశంలోని హిమాలయాలు లుంబిని, ఖాట్మండు ప్రాంతంలో జరుగుతుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత విబూత్ తదితరులు పాల్గొన్నారు.

# దేవరకద్రలో ప్రజా పాలన గ్రామసభ

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపాలిటీలో గురువారం 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక ద్వారా వార్డుల అభివృద్ధి మరియు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ కార్యక్రమం జరిగింది. స్థానిక మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డిలు ఈ సభకు హాజరై మాట్లాడారు. దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తూ, నూతనంగా మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారన్నారు. పట్టణ ప్రగతిలో వార్డు సభలు కీలకమని, ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ఈ ప్రణాళిక ఎంతగానో ఉపయోగపడుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, అధికారులు, వార్డు కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.






# బండర్ పల్లి ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని చిన్నచింతకుంట మండలం బండర్ పల్లి లో గురువారం శ్రీ అలివేలు మంగమ్మ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన పలు పూజా కార్యక్రమాలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే జిఎంఆర్ కు భక్తులు, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. పురహితులు ఆశీర్వచనం పలికి ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇందిరమ్మ గృహప్రవేశ పూజలో పాల్గొన ఎమ్మెల్యే

- నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని చిన్నచింతకుంట మండలం బండర్ పల్లి లో గురువారం శేఖర్ ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి హాజరయ్యారు. అలాగే కోట్ల ఎల్లప్ప ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ పూజా కార్యక్రమంలో కూడా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల యజమానులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. అలాగే గోపులాపూర్ లో ఎర్రోళ్ల ఆంజనేయులు కుమారుడి వివాహానికి కూడా ఎమ్మెల్యే జిఎంఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజల నీరాజనాలు అందుకుంటున్న ఎమ్మెల్యే

- రోజంతా ప్రజల చెంతకే.. అభివృద్ధిపైనే ధ్యాస

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ప్రజల అభినందనలు అందుకుంటున్నారు. పొద్దస్తమానం నియోజకవర్గంలోని ఆయా మండలాలలో ఎమ్మెల్యే జిఎంఆర్ సుడిగాలి పర్యటన చేస్తున్నారు. ఆయన ఎక్కడ ఉన్న అభివృద్ధి పైనే ధ్యాస పెడుతున్నారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం అవుతున్నారు. దీనికి తగ్గట్టు ప్రజలు కూడా జిఎంఆర్ కు అభినందిస్తున్నారు. ఆయన ఏ గ్రామానికి వెళ్లిన ఆయనకు నియోజకవర్గ ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారు. ప్రజలకు ఎటువంటి కష్టం రాకుండా వారి చెంతకే వెళ్లి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుంటున్నారు. అక్కడికక్కడే ఆ సమస్యలకు పరిష్కారం మార్గాన్ని వారికి చూపిస్తున్నారు. దీంతో ఎమ్మెల్యే జీఎంఆర్ నియోజకవర్గంలో తన మార్కుతో ప్రజలను ఆకట్టుకుంటున్నారు. చిన్న, పెద్ద అనే బేధం లేకుండా అందరితో కలిసిమెలిసి పోతున్నారు. పార్టీలకతీతంగా ప్రజాసేవకు అంకితం అవుతున్నారు. గడచిన 2 ఏళ్లలో ఎమ్మెల్యే ప్రజలకు ఎంతగానో చేరువయ్యారు.


# తాడి తరలింపై ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్రకి వినతిపత్రం

- తాడి తరలింపుకు త్వరలోనే అవసరమైన స్థల పరిశీలన ఎమ్మెల్యే



జయభేరి, పరవాడ:

తాడి తరలింపు పై కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని తప్పక నెరవేరుస్తామని అనకాపల్లి ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. గురువారం తమ గ్రామాన్ని త్వరితగతిన తరలించడానికి చర్యలు తీసుకోవాలని తాడి గ్రామస్తులు అనకాపల్లి కలెక్టరేట్ వద్ద జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల తాడి తరలింపు పై ఇచ్చిన హామీని, గెలిచిన తర్వాత తాడి తరలింపు కోసం తీసుకున్న చర్యల గురించి మంత్రికి వివరిస్తూ, తాను ఈ విషయంపై అసెంబ్లీలో చర్చించడం జరిగిందని, అదేవిధంగా ముఖ్యమంత్రితో జరిగిన భేటీలో కూడా తాడి తరలింపు విషయం చెప్పడం దానికి వారు సానుకూలంగా స్పందించడం జరిగిందన్నారు. తాడి తరలింపుకు అవసరమైన స్థలాన్ని సేకరించవలసిందిగా ఇప్పటికే గ్రామంలోని పెద్దలకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని అన్నారు. అయితే గతంలో కంటే ఇప్పుడు లబ్ధిదారులు పెరగడంతో అందరికీ ఒకే చోట స్థలం కేటాయించడానికి వీలు పడకపోవడం వలన రెండు చోట్ల అయినా స్థలాన్ని కేటాయించడానికి ఆలోచిస్తున్నామన్నారు. రెండు రోజుల్లో తాసిల్దార్ ఆర్డీవోలతో కలిసి తాను స్వయంగా స్థలాన్ని పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాదంశెట్టి నీల బాబు, మాజీ ఉపసర్పంచ్ గొల్లవిల్లి నాగరాజు, కోమటి సూరిబాబు, దానబోయిన నీలకంఠరావు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 02 :

తుర్కపల్లి మండల కేంద్రంలోని శ్రీ హనుమాన్ దేవాలయంలో గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం గణపతి పూజ ఆంజనేయ స్వామికి అభిషేకాలు, చందనాభిషేకం అనంతరం సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాలు హైకోర్టు అడ్వకేట్ తుల్లా కిష్టయ్య, ఎలగల రాజయ్య, పోరెడ్డి పాపయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టిఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ సోమల వెంకటేశం, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాల శ్రీనివాస్, ఉప సర్పంచ్ పల్లె నరేష్ గౌడ్, తుల్లా రంగనాథ్, రవికాంత్, రమాకాంత్, ఈశ్వర్, పోరెడ్డి శ్రీనివాస్, ఏలగల ఆంజనేయులు, పడాల శ్రీకాంత్, డాక్టర్ ఆకుల దేవయ్య, బొరెడ్డి హనుమంత రెడ్డి, పత్తిపాటి హనుమంతరావు, వార్డు సభ్యులు, గ్రామ యువకులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జహంగీర్ మృతి సాంస్కృతిక రంగానికి తీరని లోటు



జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 02 :

ప్రజా గాయకుడు, రచయిత, ప్రజానాట్యమండలి ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ కమిటీ సభ్యుడు ప్రస్తుత సారధి కళాకారుడు ఎండి జహంగీర్ మృతి సాంస్కృతిక రంగానికి తీరని లోటని ప్రముఖులు అన్నారు. గురువారం ఆయన పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నివాళులు అర్పించిన వారిలో ఆర్టిఐ రాష్ట్ర కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాల శ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రామచంద్రారెడ్డి, గ్రామ సర్పంచ్ సోముల వెంకటేశం, జిల్లా అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు, ఎంపీడీవో లంకల గీతారెడ్డి, ఎంపీఓ వెంకటేశ్వర్లు, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ, కొండమడుగు నరసింహ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం, సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు మాయ కృష్ణ, మండల కార్యదర్శి పోతరాజు జహంగీర్ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంటపాక శివ, పీర్లపల్లి ముత్యాలు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ, మండల కార్యదర్శి సిలువేరు దుర్గయ్య, సహాయ కార్యదర్శి గుంటుపల్లి సత్తయ్య, సిపిఎం నాయకులు కొక్కొండ లింగయ్య, తలారి మాతయ్య ఉన్నారు.

## హరీష్ రావును, కేటీఆర్ ను విమర్శించే స్థాయి బీర్లకు లేదు



జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 02 :

మాజీ మంత్రులు హరీష్ రావు, కేటీఆర్ లను విమర్శించే స్థాయి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు లేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం తుర్కపల్లి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గంలో ప్రభుత్వ విప్ ఏపాటి అభివృద్ధి చేశారని, సమయం దొరికినప్పుడల్లా పెద్ద పెద్ద నాయకులపై అవాకులు,చెవాకులు మాట్లాడినంత మాత్రాన పెద్దినోవి ఐపోరని, స్థాయికి మించి పెద్ద మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా ప్రజాపాలన పేరుతో గ్రామపంచాయతీ వద్ద గ్రామసభలు పెడుతున్నారు కానీ, ఇచ్చిన హామీలు నెరవేర్చక కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కొప్పుల అమరేందర్, బొమ్మలరామారం, యాదగిరిగుట్ట బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పోలగోని వెంకటేష్ గౌడ్, కర్రె వెంకటయ్య, మండల సెక్రెటరీ జనరల్ సాగర్ల పరమేష్ యాదవ్, మాజీ ఎంపీటీసీలు తలారి శ్రీనివాస్, గిద్దె కరుణాకర్, రాజేష్ నాయక్, మాజీ సర్పంచులు గుంటి శ్రీశైలం యాదవ్, సురేష్, నాయకులు వెంకట నరసింహారెడ్డి, రమేష్, సదుల్లా, గడ్డమీది యాదగిరి, వంగరి రమేష్, ఓర్సు బిక్షపతి పాల్గొన్నారు.

## భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గండ్ర



జయభేరి, టేకుమట్ల :

టేకుమట్ల మండలం, వెల్లంపల్లి గ్రామంలో నిర్మించనున్న శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయ భూమి పూజ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు వారిని శాలువాతో సత్కరించారు. మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## నూతన గృహప్రవేశానికి హాజరైన ప్రశాంత్ రెడ్డి

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపాలిటీకి చెందిన బిజెపి నాయకుడు దేవన్న సాగర్ కు చెందిన నూతన కామాక్షి కన్వెన్షన్ హాల్ ప్రారంభోత్సవానికి గురువారం బిజెపి దేవరకద్ర నియోజకవర్గ ఇన్చార్జి కొండా ప్రశాంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కన్వెన్షన్ హాల్ నిర్వాహకులకు ప్రశాంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మాజీ జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, నాగిరెడ్డి, 4వ వార్డు కౌన్సిలర్ ఉమా రాజు, రాచాల రాజు, అశోక్ సాగర్ లతోపాటు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద కాలుష్యాన్ని అరికట్టండి అంటూ ధర్నా



జయభేరి, పరవాడ:

హిందూజా బొగ్గు లారీలు కాలుష్యం అరికట్టాలని, ఎన్టిపిసి ధూళి కాలుష్యం అరికట్టాలని, తాడి గ్రామం తరలించాలని డిమాండ్ చేస్తూ గురువారం సిపిఎం ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు మాట్లాడుతూ హిందూజా బొగ్గు లారీలు కాలుష్యం వలన రోడ్లు ధ్వంసం అవుతున్నాయని లంకెలపాలెం పరవాడ ప్రాంతంలో భారీ ఎత్తున రోడ్లు గుంతలు పడి ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు అన్నారు. అధిక లోడుతో నడుపుతున్న హిందుజ బొగ్గు లారీలు ఎన్టిపిసి ధూళి లారీలను అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామాన్ని వెంటనే తరలించాలని ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్టిపిసి కాలుష్యంతో అల్లాడుతున్న మూల స్వయంవరం గ్రామం తరలించాలని కోరారు. నిరసన అనంతరం జిల్లా కలెక్టర్కు విన్నపం అందజేయడం జరిగింది. ఈ నిరసన కార్యక్రమంలో గని శెట్టి సత్యనారాయణ, టి అన్నపూర్ణ, గోపాలరావు, వరలక్ష్మి, నీలిమా, సత్యవతి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నేడు దేవరకద్రలో గుడ్ ఫ్రైడే వేడుకలు

- నేడు చర్చిలో క్రైస్తవ సోదరుల ప్రార్థనలు



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం జరుగు గుడ్ ఫ్రైడే వేడుకలకు క్రైస్తవ సోదరులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రతి ఏడాది స్థానిక చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకలు క్రైస్తవ సోదరులు ఘనంగా జరుపుకుంటారు. అందులో భాగంగానే విశేష దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ క్రాస్ రోడ్ వద్ద చర్చిని సిద్ధం చేసి అందులో అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆరోజు చర్చిలో క్రైస్తవ సోదరులు విశేష దినోత్సవం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి క్రైస్తవ సోదరులు అధిక సంఖ్యల హాజరవుతారు. తమ యోగక్షేమాల కోసం ఆ యేసు ప్రభువును వారు వేరు వేడుకుంటారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సంఘ కాపరి, అధ్యక్షుడు వరప్రసాద్, ఉపాధ్యక్షులు బి ఐ జేకబ్, కార్యదర్శి డేవిడ్, ఎంబీ సంఘం పాస్టర్ డీజే లూథర్ పాల్, కోశాధికారి స్టీవెన్ హాజరవుతున్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

- వెంకటేశ్వర్ల పల్లి గ్రామంలో గ్రామ సభ
- గ్రామ అభివృద్ధి నా ఎజెండా
- సర్పంచ్ రాయిచెట్టి చంద్రయ్య




జయభేరి, సైదాపూర్, ఏప్రిల్ 2 :

సైదాపూర్ మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో గురువారం రోజున గ్రామ సర్పంచ్ రాయిచెట్టి చంద్రయ్య ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా గ్రామ సభ ను నిర్వహించారు సర్పంచ్ రాయి చెట్టి చంద్రయ్య మాట్లాడుతూ వెంకటేశ్వర్ల పల్లి గ్రామంలో నూతనంగా 27 కొత్త రేషన్ కార్డులు వచ్చాయి అని అర్హులు అయిన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు లబ్ధి అయ్యేలా చూస్తాము అని అర్హులు అయిన ప్రతి ఒక్కరికి వితంతు పింఛన్ వికలాంగుల పింఛన్ వృద్ధాప్య పింఛన్ అందేలా చూస్తాము అని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పదవ తరగతి పిల్లలతో పాటు 11వ తరగతి 12వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టడం జరుగుతుంది అని విద్యార్థులకు టిఫిన్ కూడా పెట్టడం జరుగుతుంది అని తెలిపారు. గ్రామ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తాను అని ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ఒకటి 5 కోట్ల కుటుంబాలకు ఐదు లక్షల జీవిత బీమా ఇవ్వడం జరుగుతుంది అని ఈ యొక్క పథకం ఉద్దేశం వ్యవసాయ భూమి లేకపోయినా ఇంటి యజమాని చనిపోయినప్పుడు ఐదు లక్షల జీవితం భీమ వర్తిస్తుంది అని వ్యవసాయ భూమి ఉన్న వారికి కూడా ఈ యొక్క పథకం వర్తిస్తుంది అని సర్పంచ్ రాయిచెట్టి చంద్రయ్య తెలిపారు స్పెషల్ ఆఫీసర్ ఏపీఎం తిరుపతి మాట్లాడుతూ మహిళ సంఘాలు 20 గ్రూపులు కోటి 16 లక్షల 64 వేల రూపాయలు వడ్డీ లేని రుణం ద్వారా తీసుకున్న 15 గ్రూపులకు 6, లక్షల 11,000 వేల రూపాయలు తీసుకోవడం జరిగింది అని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాయిచెట్టి చంద్రయ్య, ఉప సర్పంచ్ సులోచన, స్పెషల్ ఆఫీసర్ ఏపీఎం తిరుపతి, కార్యదర్శి కొండల్ రెడ్డి, వార్డు నెంబర్లు వేముల సుమలత, బత్తుల మోహన్, బత్తుల స్రవంతి, ఎర్రల శంకర్, గుర్రం కుమారస్వామి, దయ్యాల శ్రీనివాస్, చంద్రమౌళి,ఏ ఎన్ ఎం,స్వర్ణలత, ఆశ వర్కర్ ఎర్రల శ్యామల, అంగన్వాడీ టీచర్ అమరావతి,స్కూల్ టీచర్ విష్ణు, ఎలక్ట్రిసిటీ లైన్మెన్ శ్రీకాంత్, మహిళా సంఘం అధ్యక్షురాలు భాష వేణి లీల, రాయిశెట్టి రజిత, వి ఓ ఏ రజిత, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# గాలికుంటు వ్యాధి రాకుండా ముందస్తుగా టీకాలు ఇప్పించుకోవాలి

జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 02 :



ఆవులకు, గేదెలకు గాలికుంటు వ్యాధి రాకుండా ముందస్తుగా టీకాలను ఇప్పించుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ పి. జానయ్య అన్నారు. గురువారం తుర్కపల్లి మండలం కోనాపురం గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు జాతీయ ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ చాడ భాస్కర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ జానయ్య మాట్లాడుతూ గ్రామంలో 185 పశువులకు టీకాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. గేదెలు ఆవులకు గాలికుంటు వ్యాధి రాకుండా ముందస్తుగా టీకాలు ఇప్పించుకోవాలని అన్నారు. వచ్చిన తర్వాత తీవ్ర నష్టం వాటిల్లుతుందని అన్నారు. టీకాలు వేయించని యెడల నోట్లో, కాళ్ల జెట్టలలో పుండ్లు ఏర్పడి జ్వరం వచ్చి మేతమెయ్యగా నీరసించి చనిపోయే ప్రమాదం ఉందని అన్నారు. పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుందన్నారు. కాబట్టి రైతులు మూడు నెలల వయసు గల దూడల నుండి అన్ని పశువులకు, చూడు పశువులకు కూడా టీకాలు వేయించాలని అన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 17 మండలాల్లో 47 టీములుగా ఏర్పాటు చేసి జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని మార్చి 10 నుండి నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అడ్డగూడూరు మండలంలో 1582, ఆలేరు మండలంలో 2978, ఆత్మకూర్ మండలంలో 2050, భువనగిరి మండలంలో 3693, బొమ్మల రామారం మండలంలో 2988, చౌటుప్పల్ మండలంలో 2865, గుండాల మండలంలో 1793, మోత్కూర్ మండలంలో 2725, మూటకొండూర్ మండలంలో 2574, నారాయణపురం మండలంలో 2951, పోచంపల్లి మండలంలో 3357, రాజాపేట మండలంలో 4521, రామన్నపేట మండలంలో 3389, తుర్కపల్లి మండలంలో 2813, వలిగొండ మండలంలో 4556, యాదగిరిగుట్ట మండలంలో 4003, మొత్తం 17 మండలాల్లో 52597 పశువులకు టీకాలను పంపిణీ చేసినట్టు తెలిపారు. అనంతరం తుర్కపల్లి మండలం ములకలపల్లి గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా గ్రామసభలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ రామచంద్రారెడ్డి, డాక్టర్ రామారావు ఎల్ఎస్ఏ శేఖర్, వెటర్నరీ అసిస్టెంట్లు రాఘవేంద్ర, శంషాద్దీన్, గోపాలమిత్రలు హర్ష, మహేష్, రైతులు పాల్గొన్నారు.

# గ్రామ సమస్యల పరిష్కారానికి గ్రామసభలు దోహదపడతాయి

జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 02 :



గ్రామ సమస్యల పరిష్కారానికి గ్రామసభలు దోహదపడతాయని జిల్లా అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు అన్నారు. గురువారం తుర్కపల్లి మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామంలో సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా అడిషనల్ కలెక్టర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గ్రామ ప్రజలు పలు సమస్యలు వివరించారు. ముఖ్యంగా గ్రామంలో త్రాగునీరు సమస్య ఉందని గ్రామస్తులు తెలిపారు. వెంటనే అడిషనల్ కలెక్టర్ మిషన్ భగీరథ అధికారులకు ఫోన్ చేసి ప్రజలకు తాగునీరు సమస్య లేకుండా చూడాలని అన్నారు. గృహ లక్ష్మీ పథకంలో భాగంగా గ్యాస్ సిలిండర్ కు 500 జమకావడం లేదని తెలిపారు. వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి లబ్ధిదారులకు ఇంతవరకు సబ్సిడీ ఎందుకు జమ కాలేదని వెంటనే లబ్ధిదారులందరికీ అట్టి మొత్తం జమ అయ్యేలా చూడాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, ఎంపీఓ డి.వెంకటేశ్వర్లు, ఏటీఎం రమణ పంచాయతీ కార్యదర్శి నరసింహ, ఉప సర్పంచ్ వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

- మన్యం కొండలో అలంకరణలో స్వామి దంపతుల దర్శనం
- భక్తి పారవశ్యంతో పులకించిన భక్తులు

**జయభేరి, దేవరకద్ర :**



మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రధాన దేవాలయమైన మన్యం కొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా, సాంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహించారు. ప్రతినెలా పౌర్ణమి రోజు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

అందులో భాగంగానే ఈ పవిత్ర కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా స్వామి వారిని దేవస్థానం గర్భగుడి నుండి శోభాయ మానంగా అలంకరించిన



పల్లకిలో దేవస్థానం ముందున్న రథ మండపానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం అక్కడ తవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్ కుమార్ ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవాన్ని ప్రారంభించారు. పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వాయిద్యాలు, భక్తుల హరినామశ్చరణల మధ్య ఈ పవిత్ర ఘట్టాన్ని నిర్వహించారు. అశేష భక్త జనావళి తిలకిస్తుండగా అమ్మవారి మంగళసూత్రధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే తలంబ్రాల కార్యక్రమానికి కూడా నిర్వహించారు. అనంతరం వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవాన్ని భక్తులు తిలకించి తన్మయం చెందారు. భక్తిపారవశ్యంతో పులకించారు. కళ్యాణ మహోత్సవం అనంతరం స్వామీ దంపతులను మళ్లీ పల్లకిలో గర్భగుడిలోకి తీసుకొచ్చి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్, వంశపారం ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేష్, నరసింహయ్య, పర్యవేక్షకుడు నిత్యానంద చారిలతోపాటు దేవస్థానం సిబ్బంది, పురోహితులు, వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## అపారమైన శక్తి, అజేయమైన ధైర్యానికిప్రతీక ఆ ఆంజనేయుడు

- కేశం పేట మండల మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి

**జయభేరి, షాద్ నగర్, ఏప్రిల్ 02 :**

అచంచలమైన భక్తి, అపారమైన శక్తి, అజేయమైన ధైర్యానికి ప్రతీకగా ప్రతి హృదయంలో వెలుగొందే భగవాన్ శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా ప్రజలందరికీ కేశంపేట మండలం మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా షాద్ నగర్ పట్టణంలోని 15వ వార్డు ఆంజనేయస్వామి గుడి దగ్గర తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ హనుమంతుడిలా ధైర్యసాహసాలతో, నిస్వార్థ సేవాభావంతో, అపార సహనంతో జీవించాలని, మనిషిలోని భయాలను జయించి, సత్యం, ధర్మమార్గంలో ముందుకు సాగేందుకు హనుమంతుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ మనతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ భర్త సాదిక్, సీనియర్ నాయకులు జమృద్ ఖాన్, స్థానికులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నవాబుల కోటలు కొల్లగొట్టిన పేదల పెన్నిది సర్దార్ సర్వాయి పాపన్న




**జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 02 :**

నవాబుల కోటలు కొల్లగొట్టిన పేదల పెన్నిది సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధనకు కృషి చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ భాస్కర రావు అన్నారు. గురువారం తుర్కపల్లి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, ఎంపీ ఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఈ నరేష్, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ సంతోష్ కుమార్, ఏపీఎం రమణ, సిసి రమణ, టిఏ భాస్కర్, కంప్యూటర్ ఆపరేటర్ ప్రసన్న, పాల్గొన్నారు.

## పేరుకే ప్రజాపాలన కార్యక్రమం

- దుబాసి వెంకటస్వామి, కౌన్సిలర్
- తూతూ మంత్రంగా కార్యక్రమం ముగించిన అధికారులు



**జయభేరి, పరకాల, ఏప్రిల్ 02:**

కార్యక్రమం ప్రజాపాలన కార్యక్రమం అంటే ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కాకుండా రాత్రికి రాత్రి సమాచారం ఇచ్చి పూర్తిగా వార్డు ప్రజలకు తెలియజేయకుండానే హడావుడిగా కార్యక్రమము నిర్వహించడానికి కారణమేంటి అని, అలాగే గతంలో ఇచ్చిన దరఖాస్తులన్నీ తిరిగి మళ్ళీ తీసుకోవడం ఏంటి అని కార్యక్రమం కు హాజరైన ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా గతంలో ఇచ్చిన దరఖాస్తులను, ఇప్పుడు ఇచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలన చేసి పరిష్కరించాలని ఒకటో వార్డు కౌన్సిలర్ దుబాసి వెంకటస్వామి డిమాండ్ చేసినారు. ఎండాకాలంలో ఎండలు తీవ్రంగా ఉండడం వలన నల్లాలు సమయానికి రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. వీధిలైట్ల సమస్య, ముఖ్యంగా డ్రైనేజీ సమస్యలతో ప్రజలు మురుగు వాసనతో తీవ్ర ఇబ్బందుల గురవుతున్నారు. దోమల వలన, కుక్కల వలన, కోతుల వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు ఇట్టి సమస్యలను వెంటనే పరిష్కరించాలని వార్డు ప్రజల కోరూతున్నారు.

## ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక



**జయభేరి, పీఏ పల్లి :**

పీ ఏ పల్లి మండలంలోని పెద్ద గుమ్మడం గ్రామంలో పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం భాగంగా నేడు గ్రామ సభ విజయవంతంగా జరిగింది. ఈ గ్రామ సభలో గ్రామ సర్పంచ్ బొమ్ము వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో, అంగోత్ ధరమ్ సింగ్ అన్ని శాఖల అధికారులతో కలిసి పాల్గొన్నారు. ప్రజా ప్రభుత్వం సేవాభావంతో పనిచేస్తూ సంక్షేమం అభివృద్ధి అనే రెండు అంశాలను సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తోంది. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రజల సమస్యలను సమగ్రంగా గుర్తించి, వాటి పరిష్కారంపై దృష్టి సారిస్తూ, ప్రభుత్వ పథకాలను అర్హులకు చేరవేస్తోంది. తెలంగాణ రైజింగ్ - 2047 లక్ష్యంతో రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం సంకల్పంతో ముందుకు సాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా క్రింది పథకాలపై అవగాహన కల్పించారు మహాలక్ష్మి పథకం - ఉచిత బస్సు సౌకర్యం ₹500కే గ్యాస్ సిలిండర్ 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఆరోగ్యశ్రీ రేషన్ కార్డులు సన్నబియ్యం పంపిణీ ఇందిరమ్మ ఇళ్ళు మహిళా సాధికారత పథకాలు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటమ్మతో పాటు వార్డ్ సభ్యులు ఆంజనేయులు, నాగార్జున, రాందాస్, లక్ష్మణ్ గ్రామ ప్రజలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బస్వాయిపల్లి గ్రామంలో గ్రామసభ

**జయభేరి, దేవరకద్ర :**




మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని దేవరకద్ర మండలం బస్వాయిపల్లిలో గురువారం ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక గ్రామసభను నిర్వహించారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలు, వివిధ సంక్షేమ పథకాలు, 99 రోజుల కార్యచరణ (ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక) గురించి గ్రామ ప్రజలకు అధికారులు వివరించారు. అదేవిధంగా గ్రామంలో ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులు మరియు భవిష్యత్ కార్యాచరణపై గ్రామసభలో చర్చించి పలు కీలక తీర్మానాలను ఆమోదించారు.ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటికి తక్షణ పరిష్కారం చూపించాలనే తెలంగాణ ప్రభుత్వ సంకల్పాన్ని ఈ గ్రామసభ మరోసారి స్పష్టం చేసింది.ఈ కార్యక్రమానికి ప్రత్యేక అధికారిగా మండల స్పెషల్ అధికారి, చేనేత పరిశ్రమల శాఖ అధికారి పాల్గొన్నారు.అలాగే పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్,ఉప సర్పంచ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అంగన్వాడీ కేంద్రం టీచర్, ఆశా వర్కర్లు ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ఫీల్డ్ అసిస్టెంట్ ,ఎలక్ట్రికల్ లైనమెన్, మహిళా సంఘం నాయకురాలు, వివోఏ ఓ.ఏ, తదితరులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## అభివృద్ధి పనులు ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల

**జయభేరి, పరవాడ:**



పెందుర్తి నియోజకవర్గం పరవాడ మండలంలోని రావాడ పంచాయతీలో స్థానిక గ్రామ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు ఆధ్వర్యంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు 4 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించారు. అదేవిధంగా రావాడా గ్రామపంచాయతీలో సోమినాయుడు పాలెంలో అంగనవాడీ సెంటర్, జలజీవన్ మిషన్, ధృమరాయుడుపేటలో సిసి రోడ్లు, సీసీ కాలువలు, గొల్లగుంట గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ లు మోటూరువానిపాలెం సీసీ రోడ్లు,డ్రెయిన్ లు, ధర్మారాయుడు పేట కళ్యాణ మండపం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఐదేళ్లు ఈ రాష్ట్రంలో ఎక్కడ అభివృద్ధి అనే దానికి తావు లేకుండా గత ప్రభుత్వం పరిపాలించింది అన్నారు. ఈ సందర్భంగా రావాడ పంచాయతీలోని దుర్గాలమ్మ అమ్మవారి పండుగ మహోత్సవ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు వియ్యపు చిన్నా, మాజీ ఎంపీపీ సభ్యుడు మాసరపు అప్పలనాయుడు , మాజీ జెడ్పిటిసి సభ్యులు పైలా జగన్నాథ రావు , రూరల్ జిల్లా కార్యవర్గ సభ్యుడు బిగిడి రామ గోవింద్ , ఎన్ టి పి సి పాలకవర్గ సభ్యులు ఉమ్మడి ఎన్డీఏ మహాకూటమి నాయకులు కార్యకర్తలు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దుర్గాలమ్మ అమ్మవారిని దర్శించుకొన్న మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్,ఎంపీపీ పైల

**జయభేరి, పరవాడ:**



పరవాడ మండలం ధర్మారాయుడుపేట గ్రామ దేవత దుర్గాలమ్మ అమ్మవారి పండగ సందర్భంగా ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు పెందుర్తి మాజీ శాసనసభ్యులు మరియు సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్ రాజ్ మరియు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాడుగులనియోజకవర్గ పరిశీలకులు పైల శ్రీనివాస్ వైయస్సార్ సిపి మండల పార్టీ అధ్యక్షులు కోనరామారావు మండల వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ కావలి రాజు గ్రామ కమిటీ అధ్యక్షుడు కావలివాసు కలిసి సాదరంగా ఆహ్వానించగా దుర్గమాంబ అమ్మవారిని దర్శించుకొని గ్రామ ప్రజలు ఆనందంగా ఆరోగ్యంగా వుండాలని అమ్మవారి కృప గ్రామ ప్రజలందరి పై వుండాలని అమ్మవారిని కోరుకున్నారు. ఈ యొక్క కార్యక్రమంలో వైస్సార్సీపీ సీనియర్ నాయకులు,మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, కోన రామచంద్రరావు, గెంజి సురేష్, జితిన్ యాదవ్, పల్లా గోవింద్, తోట పవన్, కేవీ రాజు, కాకి శ్రీను, జమ్ముల అశోక్, మోటూరు అప్పలనాయుడు, కావలి చిన్న, పారిపల్లి నారాయణ, మోటూరు నారాయణరావు, పోతల నాగేష్,పోతల గనేష్, మొల్లి సన్యాసిరావు భక్తులు పాల్గొన్నారు.



## వాడ్త్యా తండాలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

- ప్రజల సమస్యలు పరిష్కరించడమే నా మొదటి లక్ష్యం
- గ్రామ సర్పంచ్ నేనావత్ లక్ష్మి సర్దార్ నాయక్

**జయభేరి, దేవరకొండ :**

వడ్త్యా తండా గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక గ్రామ, మండల స్థాయిల్లో ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయడం, సంక్షేమ ఫలాలను అందించడం మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం లక్ష్యంగా అమలు చేయబడుతోంది. ఈ ప్రణాళికలో భాగంగా వాడ్త్యాతండా గ్రామం సర్పంచ్ ఆధ్వర్యంలో మొదటి రోజు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ప్రజలకు ఉపయోగపడే విధంగా అవగాహన చర్యలు గ్రామ ప్రజల సమస్యలను గుర్తించి, వాటిని వేగంగా పరిష్కరించడం. ఈ కార్యక్రమం లక్ష్యం ఈ 99 రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా ప్రభుత్వం పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత రేషన్ కార్డులు, ఉచిత బస్సు, ఉచిత పెన్షన్, ఉచిత గ్యాస్, గృహ జ్యోతి వంటి పథకాలు పై అవగాహన తో పాటు,ఆరోగ్య భద్రత, మహిళా సంక్షేమం, రైతుల సంక్షేమం, విద్య, యువత అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ అంశాలపై దృష్టి పెడతామన్నారు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ సహాయంతో గ్రామ అభివృద్ధి కార్యక్రమలు జరుగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా స్పెషల్ ఆఫీసర్ మలేష్ పంచాయతీ సెక్రెటరీ.శిరీష ఉప సర్పంచ్ వినోజ జీవన్ ఫీల్డ్ అసిస్టెంట్ లిమ్యా నాయక్ వార్డు సభ్యులు మరియు అధికారులు గ్రామ పెద్దలు పాల్గొని సభను విజయవంతం చేసినారు.

## హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**జయభేరి, దేవరకొండ :**

అచంచలమైన భక్తి, అపారమైన శక్తి, అజేయమైన ధైర్యానికి ప్రతీకగా ప్రతి హృదయంలో వెలుగొందే భగవాన్ శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా దేవరకొండ పట్టణంలోని శివాలయం వద్ద నుండి నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. ప్రతి ఒక్కరూ హనుమంతుడిలా ధైర్యసాహసాలతో, నిస్వార్థ సేవాభావంతో, అపార సహనంతో జీవించాలని, మనిషిలోని భయాలను జయించి, సత్యం, ధర్మమార్గంలో ముందుకు సాగేందుకు హనుమంతుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ దేవరకొండ ప్రాంత ప్రజలపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, దేవరకొండ సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు కొర్ర రాంసింగ్ నాయక్,పట్టణ కౌన్సిలర్లు హన్మంతు సాయి చంద్ర, కన్యశ్రీ సేవ్య నాయక్, గుండాల అంజయ్య, చంద్రమౌళి (సీఎం), పంగునురు లింగయ్య, వసుకుల సుధాకర్, బెల్దే రవీందర్, అడ్వకేట్ ఉమా మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



# కోల్‌కతాపై హైదరాబాద్ విజయం

- 'ట్రావిషేక్' మెరుపులు
- రాణించిన క్లాసెన్, నితీశ్

జయభేరి, కోల్‌కతా:
ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఎట్టకేలకు బోణీ కొట్టింది. గురువారం ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతాతో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 65 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. సన్‌రైజర్స్ నిర్దేశించిన 227 పరుగుల లక్ష్యఛేదనలో కోల్‌కతా 16 ఓవర్లలో 161 పరుగులకు కుప్పకూలింది. జైదేవ్ ఉనద్కత్(3/21), ఇషాన్ మలింగ(2/14), నితీశ్‌కుమార్(2/17) ధాటికి నిలదొక్కుకోలేకపోయింది. రఘువంశీ(52) మినహా ఎవరూ ఆకట్టుకోలేకపోయారు. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్.. హెన్రిచ్ క్లాసెన్ (35 బంతుల్లో 52, 4 ఫోర్లు, 1 సిక్స్), అభిషేక్ శర్మ (21 బంతుల్లో 48, 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), ట్రావిస్ హెడ్ (21 బంతుల్లో 46, 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపులతో నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 226 రన్స్ చేసింది.

పవర్ ప్లేలో ఓపెనర్ల మెరుపులు.. మిడిల్ ఓవర్లలో నిలకడ.. ఆఖర్లో మళ్లీ ధనాధన్.. సన్‌రైజర్స్ ఇన్నింగ్స్ సాగిన తీరిది! మ్యాచ్ ఆరంభం నుంచే ప్రత్యర్థుల మీదకు దండెత్తే ఓపెనింగ్ జోడీ ట్రావిషేక్.. రెండో ఓవర్ నుంచి బాదుడు మంత్రాన్ని జపించింది. ముజరబాని ఓవర్లో హెడ్ రెండు బౌండరీలు బాదగా అభిషేక్ సిక్స్‌తో వీరి దంచుడు మొదలైంది. వైభవ్ మూడో ఓవర్లో అయితే హెడ్ 4, 6, 6, 4తో 21 పరుగులు పిండుకున్నాడు. వరుణ్ నాలుగో ఓవర్లో అభిషేక్ 6, 4, 4, 4తో 25 రన్స్ రాబట్టాడు. త్యాగి ఐదో ఓవర్లో ఫోర్, సిక్స్‌తో హాఫ్ సెంచరీకి చేరువైన హెడ్.. నాలుగో బంతికి గ్రీన్ చేతికి క్యాచ్ ఇవ్వడంతో 82 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఇషాన్.. (14) కూడా వస్తూనే హ్యాట్రిక్ బౌండరీలతో విరుచుకుపడ్డాడు. కానీ ముజరబాని 9వ ఓవర్లో ఇషాన్‌తో పాటు అభిషేక్ ఔట్ అవడంతో స్కోరువేగం తగ్గింది. ఈ క్రమంలో క్లాసెన్, నితీశ్ కుమార్ రెడ్డి (39) ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపారు. 1317 ఓవర్లలో కోల్‌కతా బౌలర్లు కట్టడి చేయడంతో సన్‌రైజర్స్ స్కోరువేగం తగ్గినా.. ఆఖర్లో క్లాసెన్, హర్ష్ దూబే (9*) అండతో స్కోరును 220 మార్కును దాటించాడు. రికార్డు ఛేదనలో ఫిన్ అలెన్ (7 బంతుల్లో 28, 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపులతో కోల్‌కతా కూడా ఇన్నింగ్స్‌ను ధాటిగానే ఆరంభించింది. 4, 4, 6, 6, 4తో మొదటి ఓవర్లోనే 24 రన్స్ రాబట్టిన అతడిని రెండో ఓవర్లో దూబె బోల్తా కొట్టించడంతో హైదరాబాద్ ఊపిరి పీల్చుకుంది. రహానే (8)ను ఉనద్కత్, మలింగ బౌలింగ్‌లో గ్రీన్ (2) రనౌట్ అయినా రఘువంశి పోరాడాడు. పరిణితితో కూడిన ఆటతో జట్టును ముందుకు నడిపిన అతడు.. 27 బంతుల్లో వరుసగా రెండో అర్ధశతకాన్ని నమోదుచేశాడు. అయితే రింకూతో సమన్వయం లోపం కారణంగా అతడు రనౌట్ అయ్యాడు.

ఆ తర్వాత నితీశ్ వరుస ఓవర్లలో అనుకుల్, రింకూ (35)ను ఔట్ చేయడంతో ఆ జట్టు ఓటమి దాదాపుగా ఖాయమైంది. ఒక దశలో విజయం వైపు సాఫీగా నడిచిన కోల్‌కతా..హైదరాబాద్ బౌలర్ల సమష్టి ప్రదర్శనతో వికెట్లు కోల్పోయి ఓటమి వైపు నిలిచింది. సునీల్ నరైన్(12), రమణ్‌దీప్‌సింగ్(10)ను మలింగ ఒకే ఓవర్‌లో ఔట్ చేయగా, చక్రవర్తిని క్లీన్‌బౌల్డ్ చేసి కోల్‌కతా ఇన్నింగ్స్‌కు జైదేవ్ ముగింపు పలికాడు.

**సంక్షిప్త స్కోర్లు**
హైదరాబాద్: 20 ఓవర్లకు 226/8 (క్లాసెన్ 52, అభిషేక్ 48, ముజరబాని 4/41, వైభవ్ 2/47);
కోల్‌కతా: 16 ఓవర్లలో 161 ఆలౌట్ (రఘువంశి 52, రింకూసింగ్ 35, జైదేవ్ 3/21, మలింగ 2/14)



# ఇటలీకి మూడోసారీ.. ఫిఫా ప్రపంచకప్‌నకు అనర్హత

నాలుగుసార్లు ప్రపంచ చాంపియన్ ఇటలీకి మళ్లీ షాక్. సాకర్‌ను శ్వాసగా భావించే ఆ దేశంలో ఫుట్‌బాల్ అభిమానులకు మరోసారి గుండెకోతను మిగుల్చుతూ ఇటలీ జట్టు వరుసగా మూడోసారి ఫిఫా ప్రపంచకప్‌నకు అర్హత సాధించడంలో విఫలమైంది. భారత కాలమానం ప్రకారం బుధవారం ఇక్కడ జరిగిన యూరోపియన్ ప్లేఆఫ్స్‌లో ఇటలీ.. 41 (11)తో తనకంటే తక్కువ ర్యాంకు కల్గిన బోస్నియా అండ్ హెర్జెగొవిన చేతిలో ఓడింది. నిర్ణీత సమయంలో ఇరుజట్లు 11తో సమంగా ఉండటంతో విజేతను షూటౌట్ ద్వారా నిర్ణయించగా ఇటలీ ఒక్కటంటే ఒక్కటే గోల్ కొట్టగా బోస్నియా 4 గోల్స్ సాధించి మెగా టోర్నీకి క్వాలిఫై అయింది.1934, 1938, 1982, 2006లో ప్రపంచకప్‌ను గెలుచుకున్న ఇటలీ.. 2018 (స్వీడన్ చేతిలో), 2022 (మాసిడోనియాపై) తర్వాత వరుసగా మూడోసారి వరల్డ్ కప్‌నకు క్వాలిఫై కావడంలో విఫలమైంది.

2010, 2014లో వరల్‌డ్‌కప్‌లో ఆడినా గ్రూప్ స్టేజ్ దాటలేకపోయింది. ఇదిలాఉండగా తాజా ఓటమితో ఇటలీ సాకర్ సమాఖ్య (ఎఫ్ఐజీసీ) అధ్యక్షుడు గ్యాబ్రియెల్ గ్రావినా తన పదవికి రాజీనామా చేశాడు. జాతీయ జట్టు వైఫల్యాన్ని ఇటలీ మీడియా 'మహా విపత్తు'గా అభివర్ణించింది. 'గజెట్టా డెల్లో స్పోర్ట్' అనే పత్రిక ఈ ఓటమిని 'ది థర్డ్ అపోకలిప్స్' (మూడవ విపత్తు)గా రాస్తూ.. 'ఇకపై దిగ్భ్రాంతికి గురవడం లేదా ఊహించని విపత్తును ఎదుర్కోవడం అనే భావన ఉండదు. ఇది సాధారణమైపోతుంది' అని పేర్కొంది.

# ధోనీ.. ముందుగానే!

చెన్నై: గాయంతో ఐపీఎల్ 19లో ఆరంభ మ్యాచ్‌కు దూరమైన సీఎస్‌కే మాజీ సారథి మహేంద్ర సింగ్ ధోనీ అనుకున్న సమయానికంటే ముందే రీఎంట్రీ ఇస్తాడా? అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. కండరాల నొప్పితో బాధపడుతూ కనీసం నాలుగువారాలైనా ఆటకు దూరమవుతాడని సీఎస్‌కే వర్గాలు చెప్పినా రెండువారాల్లోపే మహీ కమ్‌బ్యాక్ ఇస్తాడని సమాచారం. చెన్నైలోని చెపాక్ స్టేడియంలో ధోనీ నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్న వీడియోలు వైరల్ అవడంతో ధోనీ రీఎంట్రీ ముందుగానే ఉంటుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు. అన్నీ కుదిరితే చెన్నై ఆడే మూడో మ్యాచ్ (ఈనెల 11) నాటికి ధోనీ సిద్ధమవుతాడని వినికిడి. అయితే దీనిపై సీఎస్‌కే నుంచి అధికారిక ప్రకటన అయితే వెలువడలేదు.



# వామ్మో.. ఆ సినిమాకు సీక్వెలా.. ?



సెల్వరాఘవన్ దర్శకత్వంలో కార్తి, రీమాసేన్, ఆండ్రియా ప్రధాన పాత్రల్లో వచ్చిన 'యుగానికి ఒక్కడు' చిత్రం అప్పట్లో సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. అడ్వెంచర్ ఫాంటసీ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయం సాధించకపోయినా.. ఆ తర్వాత ఒక కల్ట్ క్లాసిక్ హోదాను సంపాదించుకుంది. ఈ సినిమాకు సీక్వెల్ ఎప్పుడెప్పుడు వస్తుందా అని అభిమానులు గత దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో దర్శకుడు సెల్వరాఘవన్, ధనుష్ హీరోగా 'యుగానికి ఒక్కడు2'ను ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. అయితే, ఈ సీక్వెల్ గురించి తాజాగా హీరోయిన్ ఆండ్రియా జెర్మియా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సినిమా ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారాయి. మొదటి భాగంలో కీలకమైన 'లావణ్య' పాత్రలో నటించిన ఆండ్రియా, రెండో భాగంలో కూడా కనిపిస్తుందని అందరూ భావించారు. కానీ ఆమె స్పందన మాత్రం భిన్నంగా ఉంది. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో దీనిపై స్పందిస్తూ.. ఆ సీక్వెల్‌లో తాను ఉండే అవకాశం లేదని ఆమె స్పష్టం చేశారు. ఆండ్రియా మాట్లాడుతూ.. "యుగానికి ఒక్కడు మొదటి భాగం షూటింగ్ సమయంలో మేము పడిన కష్టం అంతా ఇంతా కాదు. అడవుల్లో, ఎడారుల్లో షూటింగ్ చేయడం చాలా శారీరక శ్రమతో కూడుకున్న పని. అయితే ఇప్పుడు మళ్ళీ అదే రిస్క్ తీసుకోవడానికి నేను సిద్ధంగా లేను. పైగా మొదటి భాగం వచ్చి చాలా కాలం అయ్యింది. అందుకే సీక్వెల్‌లో నేను ఉండకపోవడమే మంచిదని భావిస్తున్నాను" అని పేర్కొన్నారు. ఈ సీక్వెల్ ధనుష్‌తో భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నారని, అది ఖచ్చితంగా పెద్ద విజయం సాధిస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఆండ్రియా చేసిన ఈ వ్యాఖ్యలు విన్న అభిమానులు కొంత నిరాశకు గురవుతున్నారు. ఒకవేళ ఆండ్రియా లేకపోతే, మొదటి భాగంలోని ఆ ఇంటెన్సిటీ మళ్ళీ కనిపిస్తుందా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.




# బైకర్ సినిమా అదిరిపోయిందంటగా..

శర్వానంద్ హీరోగా నటించిన లేటెస్ట్ మూవీ బైకర్.. నారి నారి నడుమ మురారి సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న శర్వా.. ఈ సరి బైకర్ గా ప్రేక్షకులను పలకరించనున్నాడు. స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమా నేడు (శుక్రవారం) గ్రాండ్ గా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. భిలాష్‌రెడ్డి దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందిన హైఆక్టేన్ రేసింగ్ డ్రామా 'బైకర్'తో అలరించడానికి సిద్ధమవుతున్నారు. భారతదేశపు మొట్టమొదటి మోటోక్రాస్ అడ్వంచరస్ చిత్రంగా ఈ సినిమాను విడుదల చేశారు. ఇక ఈ సినిమా ఎలా ఉందొ సినిమా చూసిన ఆడియన్స్ ట్విట్టర్ వేదికగా పంచుకుంటున్నారు. సినిమా చూసిన ఆడియన్స్ సినిమా అదిరిపోయిందని రివ్యూ ఇస్తున్నారు. ముఖ్యంగా ఈ సినిమా యూత్ ను ఆకట్టుకుంటుందని అంటున్నారు. అలాగే కొడుకు తండ్రి మధ్య వచ్చే సీన్స్ బాగున్నాయని అంటున్నారు. మరికొంత మంది.. సినిమా చాలా బాగుంది.. ఇప్పుడు చూడకుండా తర్వాత అండర్ రేటెడ్ మూవీ అనొద్దు అంటూ సలహాలు ఇస్తున్నారు.

# డిసెంబర్‌లో ఫౌజీ?



ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న దేశభక్తి ప్రధాన చిత్రం 'ఫౌజీ'. హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్నది. ఇందులో ప్రభాస్ బ్రిటీష్ సైనికుడి పాత్రలో కనిపించనున్నారు దేశభక్తి, ప్రేమ, త్యాగం అంశాలతో ఎమోషనల్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతున్నది. ఈ పాన్ ఇండియా సినిమా విడుదల గురించి ప్రభాస్ అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఆగస్ట్ 15న రిలీజ్‌కు సన్నాహాలు చేస్తున్నారని వార్తలొచ్చాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం డిసెంబర్ 4న ఈ చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. ఇప్పటికే ఈ సినిమా 70 శాతం చిత్రీకరణ పూర్తచేసుకుంది. మంచి క్వాలిటీ అవుట్‌పుట్‌ను దృష్టిలో పెట్టుకొని పోస్ట్‌ప్రొడక్షన్ కోసం మరింత సమయాన్ని వెచ్చించే ఆలోచనలో చిత్రబృందం ఉన్నట్లు తెలిసింది. రిలీజ్ డేట్‌కు సంబంధించిన వార్తలో నిజమెంతో తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. మిథున్ చక్రవర్తి, అనుపమ్‌ఖేర్, జయప్రద, భానుచందర్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి నిర్మాతలు: నవీన్ యర్నేని, వై. రవిశంకర్.

# సంగీత దిగ్గజానికి ఘన నివాళి

## కేరళలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహం ఆవిష్కరణ..



భారతీయ సంగీత ప్రపంచాన్ని తన స్వరంతో దశాబ్దాల పాటు అలరించిన గాన గంధర్వుడు S. P. బాలసుబ్రహ్మణ్యంకు కేరళలో అరుదైన గౌరవం దక్కింది. పాలక్కాడ్‌లోని వి.టి. భట్ట తిరిప్పాడ్ కల్చరల్ సెంటర్‌లో ఆయన 10 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ఆయన కుటుంబ సభ్యులు, సినీ ప్రముఖులు, అభిమానుల సమక్షంలో విశేషంగా జరిగింది. సంగీతానికి భాషా, ప్రాంతీయ భేదాలు లేవని మరోసారి కేరళ ప్రజలు నిరూపించారు. పరభాషా గాయకుడైనప్పటికీ ఎస్పీబీపై తమకున్న అపారమైన అభిమానాన్ని ఈ విగ్రహావిష్కరణ ద్వారా తెలియజేశారు. ప్రముఖ శిల్పి ఉన్ని కణయ్ రూపొందించిన ఈ విగ్రహం అభిమానులను ఆకట్టుకుంటోంది.

ఈ కార్యక్రమంలో ఎస్పీబీ తనయుడు చరణ్‌తో పాటు ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి, గాయకులు మనోజ్, చిత్ర, హరిహరన్, సుజాత్ మోహన్, ఉన్ని మీనన్, విజయ్ ఏసుదాస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా "సంగీత మేఘం" పేరిట ప్రత్యేక సంగీత విభావరి నిర్వహించి, ఎస్పీబీకి గాన నివాళి అర్పించారు. పలువురు ప్రముఖ గాయకులు ఆయన పాటలను ఆలపిస్తూ భావోద్వేగంగా గుర్తుచేసుకున్నారు. గతంలో హైదరాబాద్‌లో ఎస్పీబీ విగ్రహ ఏర్పాటుపై వివాదాలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. రవీంద్ర భారతిలో విగ్రహాన్ని ప్రతిష్ఠించే సమయంలో ప్రాంతీయ వివాదాలు తలెత్తాయి. అయితే కేరళలో మాత్రం ఎలాంటి వివాదాలు లేకుండా ఘనంగా కార్యక్రమం నిర్వహించడం విశేషంగా నిలిచింది.

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కేవలం గాయకుడిగానే కాకుండా, నటుడు, డబ్బింగ్ ఆర్టిస్ట్, సంగీత దర్శకుడిగానూ విశేష సేవలు అందించారు. 16 భాషల్లో 40 వేలకు పైగా పాటలు పాడి గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించారు. మలయాళంలోనూ ఆయన ఎన్నో గుర్తుండిపోయే పాటలు పాడారు. 2020 సెప్టెంబర్ 25న కరోనా కారణంగా ఆయన కన్నుమూసినా, తన అమర గానంతో సంగీత ప్రియుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. కేరళలో విగ్రహావిష్కరణతో ఆయనకు మరొక చిరస్మరణీయ గౌరవం దక్కిందని అభిమానులు భావిస్తున్నారు.

# అందుకే రిజెక్ట్ చేశా !

కుమారి 21F తర్వాత తనకు అనేక అవకాశాలు వచ్చాయని, అయితే కొన్ని చర్చల దశలోనే ఆగిపోయాయని తెలిపారు. ఆ సమయంలో గ్లామరస్, బోల్డ్ పాత్రలకే ఎక్కువగా పరిమితం అవుతున్నాననే విమర్శలను ఎదుర్కొన్నానని, ఒక దశలో టైప్‌కాస్ట్ అయ్యాయని అన్నారు. అయితే, ప్రస్తుతం నటనకు ప్రాధాన్యత ఉన్న విభిన్న పాత్రలు కూడా వస్తున్నాయని, తాను కూడా విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటున్నానని స్పష్టం చేశారు. కుమారి 21F వంటి పాత్రలను మళ్లీ మళ్లీ చేయడం వల్ల వచ్చిన విమర్శలను గ్రహించి, భవిష్యత్తులో అలాంటి తప్పు చేయకుండా వైవిధ్యాన్ని కోరుకుంటున్నట్లు చెప్పారు. 2020 తర్వాత తాను మరింత సెలెక్టివ్‌గా మారానని, ఓటీటీ కంటెంట్ వైపు మొగ్గు చూపుతూ, అర్థవంతమైన పాత్రల కోసం ఎదురుచూశానని తెలిపారు. ఈ క్రమంలోనే జీ5లో విడుదలైన వ్యవస్థ వెబ్ సిరీస్‌లో నటించారు. ఈ సిరీస్‌లో తన పాత్రను బాగా ఎంజాయ్ చేసినట్లు పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో సంచలనం సృష్టించిన బేబీ సినిమాలో తనకు మొదట అవకాశం వచ్చిందని ప్రచారంలో ఉన్న వార్తలను హెబ్బా పటేల్ ఖండించారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి తనకు ఎవరూ ఆఫర్ ఇవ్వలేదని, సాయి రాజేష్‌తో పరిచయం ఉన్నప్పటికీ, ఈ సినిమా గురించి ఎప్పుడూ చర్చ జరగలేదని ఆమె స్పష్టం చేశారు. తెలుగు చిత్ర పరిశ్రమకు ఎప్పుడూ అధిక ప్రాధాన్యత ఇస్తానని హెబ్బా పటేల్ పునరుద్ఘాటించారు. హిందీ, కన్నడ, తమిళం, మలయాళ భాషల్లోనూ అవకాశాలు వస్తే నటించడానికి సిద్ధంగా ఉన్నానని, భవిష్యత్తులో మరిన్ని భాషల్లో నటించాలని కోరుకుంటున్నానని హెబ్బా పటేల్ తెలిపారు.



Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**